చురక

కంటి వెలుగు ఇంటి వెలుగు
కదిలే అభివృద్ధి వెలుగు
ప్రతినిత్యం వివక్షల
పంజరంలో ఆమె నలుగు.

అణచివేసే సమాజాన్ని
అడ్డుకుంటె లేదు మెరుగు
పిడికిలై బిగియకుంటె
ప్రగతి లేని భవిత పరుగు



-వేల్పుల నారాయణ
9440433475

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 9-3-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:173 పేజీలు:6 వెల: రూ.1/-

## 36 మంది అభ్యర్థులతో కాంగ్రెస్ పార్టీ తొలి జాబితా విడుదల

**-నల్గొండ - కుందూరు రఘువీర్‌రెడ్డి, మహబూబాబాద్ నుంచి బలరాం నాయక్, జహీరాబాద్ - సురేశ్ షేట్కర్, చేవెళ్ల - సునీతా మహేందర్‌రెడ్డి**

న్యూ ఢిల్లీ మార్చ్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీ 36 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసింది. కర్ణాటక, కేరళ, హరియాణ, త్రిపుర, సిక్కిం, మేఘాలయ, మణిపూర్ రాష్ట్రాల్లో అభ్యర్థులను ప్రకటించింది. తెలంగాణ లో మొత్తం 17 లోక్‌సభ స్థానాలు ఉండగా.. వీటిలో నాలుగు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది కాంగ్రెస్ పార్టీ. నల్గొండ - కుందూరు రఘువీర్‌రెడ్డి, మహబూబాబాద్ నుంచి బలరాం నాయక్, జహీరాబాద్ - సురేశ్ షేట్కర్, చేవెళ్ల - సునీతా మహేందర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా ఇప్పటికే వంశీచందర్‌రెడ్డి ల పేర్లను ఫైనల్ చేసింది కాంగ్రెస్ అధిష్ఠానం.

## రూ.2 వేల కోట్ల అంచనా వ్యయంతో పాతబస్తీ మెట్రోకు శంకుస్థాపన

**- మెట్రో అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ కష్టాలు తీరనున్న ఓల్డ్ సిటీ**

**-పాతబస్తీ మరింత అభివృద్ధి దిశలోకి : సీఎం రేవంత్ రెడ్డి**



హైదరాబాద్ మార్చ్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: సుమారు రూ. 2 వేల కోట్ల అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన పాతబస్తీ మెట్రో శంకుస్థాపన కార్యక్రమం సీఎం రేవంత్ రెడ్డి చేతులమీదుగా శుక్రవారం జరిగింది. ఫరూక్ నగర్ బస్ డిపో వద్ద ఆయన శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట ఎంపీ అసదుద్దీన్ తదితరులు ఉన్నారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్ నుమా వరకు మెట్రోను పొడగించనున్నారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కిలోమీటర్ల పొడవునా ఈ రైలుమార్గంలో 5 మెట్రో స్టేషన్లు ఉంటాయి.దీనికి రూ. 2 వేల కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. నిర్మాణం పూర్తయితే సికింద్రాబాద్ నుంచి జేబీఎస్, ఎంజీబీఎస్ మీదుగా పాతబస్తీకి ప్రయాణం చేయొచ్చు. సాలార్ జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, షంషిర్ గంజ్, ఫలక్ నుమా మెట్రో స్టేషన్లు ఉంటాయి. మత పరమైన నిర్మాణాలకు ఆటంకాలు సృష్టించకుండా మెట్రో నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించింది. కేటాయించిన నిధుల్లో రూ.వెయ్యి కోట్లు స్థల సేకరణకే వెళ్తాయని అధికారులు చెబుతున్నారు. ఓల్డ్ సిటీ మెట్రో అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ కష్టాలు తీరడంతోపాటు పాతబస్తీ మరింత అభివృద్ధి దిశలో దూసుకుపోనుంది.

## శివుడి ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి జరగాలి : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ఖమ్మం, మార్చి 8:(నేటినిజం ప్రతినిధి): ఖమ్మం జిల్లా వైరా మండలం స్నానాల లక్ష్మీపురం గ్రామం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, నందిని దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహాశివరాత్రి సందర్భంగా జరిగే జాతర ఉత్సవాలను పుణ్యస్నానాలు జరిగే ప్రాంతాన్ని సందర్శించారు. జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ? తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ప్రపంచవ్యాప్త తెలుగు ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం శివుని అనుగ్రహంతో ఎంతో అభివృద్ధి జరగాలని కోరారు. మహాశివరాత్రి రోజు శివుని పూజించటం ఎంతో శుభప్రదమన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి భావంతో పూజించి అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూవాళ్ళ దుర్గాప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకట నర్సిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

## వేములవాడలో పట్టువస్త్రాల సాంప్రదాయానికి తూట్లు పొడిచిన హస్తం నేతలు



రాజన్న సిరిసిల్ల, మార్చి 8:(నేటి నిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో వేములవాడ ఆలయంలో పట్టువస్త్రాల సాంప్రదాయానికి హస్తం నేతలు తూట్లు పొడిచారు. సాంప్రదాయానికి విరుద్ధంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి పట్టు వస్త్రాలను కాంగ్రెస్ ప్రభుత్వం సమర్పించింది. వాస్తవానికి సీఎం రేవంత్ రెడ్డి వేములవాడ పర్యటనకు వెళ్లాల్సి ఉండే. కానీ ఆ పర్యటన రద్దు అయింది. దీంతో హైదరాబాద్‌లో సమావేశం ఉందని చెప్పి ఒక రోజు ముందే.. పట్టు వస్త్రాలను మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కలిసి సమర్పించారు. తరతరాల ఆచారానికి తూట్లు పొడవటంపై అర్చకులు మండిపడుతున్నారు. ఆలయ ఈవో, అధికారుల తీరుపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేటి కందం- నేటికి అందం

అనయమ్మారోగ్యమునకు
తనవంతుగ సేవలనిడి తనరెడి కిడ్నీ
దినమును జరుపంగ వలయు
జనసామాన్యమ్ము బ్రతుకు సాగించు గతిన్
(ప్రపంచ కిడ్నీ దినం )



-రాధశ్రీ
సెల్:9494481210

# జగమంతా శివోహం..శైవ క్షేత్రాలు కిటకిట..





హైదరాబాద్, మార్చి 8:మహాశివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఆలయాల్లో పరమశివుడిని కొలుస్తూ రుద్రాభిషేకాలు చేస్తున్నారు. ఏపి, తెలంగాణాలోని శైవ క్షేత్రాలైన శ్రీశైలం, శ్రీకాళహస్తి, వేములవాడ, కీసర ఆలయాలకు భక్తులు వేకువ జామున నుంచే పోటెత్తారు. శ్రీకాళహస్తి ఆలయంలో గురువారం అర్ధరాత్రి దాటాక భక్తులను దర్శనానికి ఆలయంలోకి అనుమతించారు. శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బాపట్ల జిల్లా చినగంజాం మండలం సోపిరాల, కొత్తపాలెం శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

### వేములవాడ, కీసర లో ప్రత్యేక అభిషేకాలు

ఇక, తెలంగాణ రాష్ట్రంలోని వేములవాడ రాజన్న ఆలయం, కీసర రామలింగేశ్వరస్వామి ఆలయం, కాళేశ్వరం, చెర్వుగట్టు లింగమంతుల ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకుంటున్నారు. వరంగల్‌లోని ప్రసిద్ధ ఆలయమైన వేయిస్తంభాల గుడిలో పునర్మిర్మాణం చేసిన కళ్యాణమండపాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించారు. కుటుంబ సమేతంగా వేయి స్తంభాల గుడిలో పూజలు చేశారు.

### వేయి స్తంబాల ఆలయంలో భక్త జనం

మహా శివరాత్రి సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో శైవక్షేత్రాలు భక్తులతో రద్దీగా మారాయి. అర్ధరాత్రి నుంచే మహాశివునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. వరంగల్ వేయిస్తంభాల ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. నగరంలోని వేయి స్థంబాల దేవాలయం, సిద్దేశ్వరాలయం, కురవి శ్రీ వీరభద్రేశ్వరుడి ఆలయాలుభక్తులతో కిటికిటలాడుతున్నాయి. అయినవోలు మల్లికార్జున స్వామి ఆలయం, పాలకుర్తి సోమేశ్వరాలయాలకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఈ ఆలయాల్లో అభిషేకం చేసుకునేందుకు తెల్లవారుజామున నుంచి భక్తులు బారులు తీరారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జాగారం, ఉపవాసం చేసే వారికొసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

### కాళేశ్వరంలోనూ భక్త జన వాహిణి..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో కూడా మహాశివరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే భక్తులు కాళేశ్వర ముక్తీశ్వరుని దర్శనానికి క్యూ కట్టారు. ఇతర జిల్లాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్ గడ్ నుంచి భక్తులు తరలివస్తున్నారు. త్రివేణి సంగమంలో స్నానాలు ఆచరించి, గోదారి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేసి, మారేడు దళాలతో సమర్పిస్తున్నారు.

ఉమ్మడి నల్గొండ జిల్లావ్యాప్తంగా ఉన్న శివాలయాలు శివనామ స్మరణతో మారుమోగుతున్నాయి. పానగల్లులోని ఛాయా, పచ్చల సోమేశ్వర ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్వామి వారిని దర్శించుకొని అభిషేకాలు చేస్తున్నారు. సూర్యాపేట పిల్లలమర్రి, మేళ్ల చెర్వు స్వయంభు శంభులింగేశ్వర స్వామి ఆలయాల్లో భక్తుల ఆధ్యాత్మిక సందడి నెలకొంది. చెర్వుగట్టు పార్వతీజడల రామలింగేశ్వర స్వామి, వాడపల్లి ఆగస్తేశ్వర స్వామి దేవాలయాలల్లో భక్తులు భక్తి ప్రపత్తులతో పూజలు నిర్వహిస్తున్నారు భక్తుల కోసం ఆలయ కమిటీ సభ్యులు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. మంచి నీటి సౌకర్యం కల్పించారు.

ఖమ్మం జిల్లాలోని శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. గుంటి మల్లన్న , తీర్థాల, కూసుమంచి, పెనుబల్లి, మధిర , భద్రాచలంలలో శివాలయాల్లో భక్తులు బారులు తీరారు.

### శ్రీశైలంలో పోటెత్తిన భక్తజనం..



అటు ఏపీలోనూ శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగుతున్నాయి. శ్రీశైలంలో మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి 12 గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహించనున్నారు. శివనామ స్మరణతో నల్లమల గిరులు మోగుతున్నాయి. శ్రీశైలం మల్లన్న క్షేత్రం, శ్రీకాళహస్తిలోని వాయులింగేశ్వరస్వామి ఆలయం, మహానంది ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శ్రీశైలంలో అర్థరాత్రి 2 గంటల నుంచే దర్శనాలు ప్రారంభమయ్యాయి. చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు నుంచి కూడా భక్తులు తరలివచ్చి ముక్కంటి దర్శనం చేసుకుంటున్నారు.

శ్రీ సత్యసాయి జిల్లాలోని లేపాక్షిలో మహాశివరాత్రిని పురస్కరించుకుని శ్రీ దుర్గా, పాపనాశేశ్వర, వీరభద్ర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు శివపార్వతుల కళ్యాణోత్సవం, రుద్ర హోమం, దీపోత్సవం నిర్వహించనున్నారు.

### కోటప్పకొండపై తిరునాళ్ల సందడి..

పల్నాడులోని కోటప్పకొండపై వైభవంగా మహాశివరాత్రి తిరునాళు ప్రారంభమయ్యాయి. తెల్లవారుఝామునుంచే భక్తులు పోటెత్తారు.., అమరావతి, గుంటూరు జిల్లాలోని క్వారీ, గోవాడ తదితర ప్రాంతాల్లోని శైవ క్షేత్రాల్లో భక్తుల రద్దీ నెలకొంది.

### గోదావరి పుణ్య స్నానాలు..

రాజమండ్రిలో. గోదావరి స్థాన ఘట్టాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. చుట్టుపక్కల ప్రాంతాల నుండి భారీగా తరలివచ్చిన భక్తులు పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. రాజమండ్రిలోని పుష్కర్ ఘాట్, కోటిలింగాలు ఘాట్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. శివాలయాల్లో తెల్లవారు జాము నుండి దర్శనాలు ప్రారంభ మయ్యాయి.స్వామివారి దర్శనానికి ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు.

రాజమండ్రిలో కోటిలింగాలు ఘాట్ నుండి పుష్కర్ ఘాట్ మీదుగా గౌతమి ఘాట్ వరకు భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గోదావరి గట్టు రోడ్లో భక్తులు రద్దీ దృష్ట్యా వాహనాల రాకపోకలు నిలిపివేశారు. స్నాన సమయంలో ఘట్టాల్లో. ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పడవలతో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు.

### దేశ వ్యాప్తంగా శైవ క్షేత్రాలలో భక్తుల కిటకిట..

దేశవ్యాప్తంగా శివరాత్రి వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. శైవాలయాలన్నీ శివనామస్మరణతో మారుమోగుతున్నాయి. తెల్లవారు జామునే ఆలయాలకు చేరుకున్న భక్తులు.. పరమేశ్వరున్ని భక్తిశ్రద్ధలతో పూజిస్తున్నారు. కాశీ విశ్వనాథుని దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. మధ్యప్రదేశ్ ఉజ్జయిని మహంకాళ్ ఆలయంలో శివరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామి వారికి అర్చకులు పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ప్రయాగ్ రాజ్‌లో పుణ్యస్నానాలు చేసి నది ఒడ్డున దీపాలు వెలిగించి పూజలు చేస్తున్నారు. గోరఖ్ పూర్‌లో జార్ఖండి మహాదేవ్ ఆలయంలో పరమేశ్వరున్ని మారేడు దళాలతో భక్తులు పూజిస్తున్నారు.

## నిమ్స్ అభివృద్ధికి మరింత కృషి చేస్తా : దామోదర్ రాజనర్సింహ

హైదరాబాద్, మార్చి 8:నిమ్స్ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. హైదరాబాద్‌లోని నిమ్స్‌కు జాతీయ స్థాయిలో బ్రాండ్ ఇమేజ్ ఉందని ఎర్కొన్నారు. శుక్రవారం నిమ్స్‌లో నూతనంగా నిర్మించిన డీఎస్‌ఏ, సీపీఆర్ ల్యాబ్‌లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో నిమ్స్‌కు బ్రాండ్ ఇమేజ్ ఉందన్నారు. నిమ్స్ బ్రాండ్ కొనసాగేలా తనవంతు సహకారం అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉస్మానియా, గాంధీ, కాకతీయ, ఆసుపత్రితో పాటు నిమ్స్ ఆస్పత్రి ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందిస్తూ రాష్ట్రాన్ని హెల్త్ డెస్టినేషన్‌గా ప్రపంచవ్యాప్తంగా ఎంతో గుర్తింపును రావడానికి కృషి చేస్తున్నారన్నారు.

తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో మెడికల్ టూరిజంతో పాటు హెల్త్ ఎడ్యుకేషన్‌కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపుకు కృషి చేస్తున్నామని తెలిపారు. వచ్చే 20 ఏండ్ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని విద్య, వైద్య రంగాలు మరింత అభివృద్ధి చెందేలా రాష్ట్ర ప్రభుత్వం నూతన కార్యాచరణను రూపొందిస్తున్నామని వెల్లడించారు. 39 మంది అసోసియేట్ ప్రొఫెసర్‌లు, 300 మంది స్టాప్ నర్సులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, మెడికల్ సూపరింటెండెంట్ డా. నిమ్మ సత్యనారాయణ, కార్డియా లజీ విభాగదిపతి సాయి సతీష్, యూ?స్‌ఏఐడీ డా.వర ప్రసాద్, నిఖిల్ రెడ్డి, నిమ్స్ ఆస్పత్రి వివిధ విభాగాధిపతులు, డాక్టర్లు నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## మోదీ చేతుల మీదుగా నేషనల్ క్రియేటర్స్ అవార్డు ప్రదానం..



న్యూఢిల్లీ, మార్చి 8: ఎన్నికల ఫలితాలనే ఈ సారి పునరావృతం చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. శుక్రవారం ఢిల్లీలోని భారత మండపంలో నేషనల్ క్రియేటర్స్ అవార్డులను ఆయన ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ సృజనాత్మక వీడియోలు, కథనాలతో సమాజంలో మార్పు కోసం కృషి చేస్తున్న కంటెంట్ క్రియేటర్స్‌ను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులను నూతనంగా ప్రవేశపెట్టింది. "స్టోరీ టెల్లింగ్, సామాజిక మార్పు, పర్యావరణ పరిరక్షణ, విద్య, గేమింగ్ వంటి వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారిని గుర్తించి, ప్రోత్సహించడమే ఈ అవార్డుల ముఖ్య ఉద్దేశం" అని తెలిపారు..

"మహిళా దినోత్సవం, శివరాత్రి రోజున ఈ అవార్డులను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉంది. విజేతలకు నా అభినందనలు. సృజనాత్మకతతో ఈ రోజు మీరంతా ఇక్కడిదాకా చేరుకున్నారు. భారత్ భవిష్యత్తు గురించి చర్చించేందుకే మనమంతా ఇక్కడ సమావేశమయ్యాం. పరిస్థితులకు అనుగుణంగా వచ్చే మార్పులను స్వీకరించడం మన బాధ్యత. తక్కువ ధరకు డేటా, మొబైల్ ఫోన్లు లభిస్తుండటంతో ఎంతో మంది కంటెంట్ క్రియేటర్లకు అవకాశం లభిస్తోంది. ఈ అవార్డులు దేశంలోని ప్రతి యువ కంటెంట్ క్రియేటర్ ప్రతిభకు నిదర్శనం. గత ఎన్నికల్లో మాదిరే ఈ సారి భాజపా క్లీన్‌స్వీప్ చేస్తుంది. అదే మా లక్ష్యం" అని ప్రధాన మోదీ అన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛ అంబాసిడర్ అవార్డు అందుకున్న మల్హార్ కలాంబేను ఉద్దేశించి 'సన్నగా కనిపిస్తున్నావ్.. బాగా తినాలి' అని సరదాగా వ్యాఖ్యానించారు.

**20 అవార్డుల కోసం 1.50 లక్షల నామినేషన్స్**

ఈ అవార్డుల కోసం 20 విభాగాల్లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 1.5 లక్షల నామినేషన్స్ వచ్చాయి. వారికి మద్దతుగా పది లక్షల మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. అందులోంచి 23 మందిని విజేతలుగా ఎంపిక చేశారు. వీరిలో ముగ్గురు అంతర్జాతీయ క్రియేటర్స్ ఉన్నారు. మోస్ట్ క్రియేటివ్ క్రియేటర్ అవార్డును మహిళల విభాగంలో శ్రద్ధ, పురుషుల విభాగంలో ఆర్జే రౌనాక్ అందుకున్నారు.

## ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి సతీమణి సుధామూర్తి రాజ్యసభకు నామినేట్

**-సుధామూర్తికి శుభాకాంక్షలు తెలుపుతూ ప్రధాని మోదీ ట్వీట్**

న్యూ డిల్లీ మార్చ్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ప్రముఖ విద్యావేత్త, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి సతీమణి సుధామూర్తి రాజ్యసభకు నామినేట్ అయ్యారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సుధామూర్తిని ఎగువ సభకు నామినేట్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు.ఈ మేరకు సుధామూర్తికి శుభాకాంక్షలు తెలుపుతూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. సుధామూర్తి రాజ్యసభకు నామినేట్ కావడం సంతోషకరమైన విషయమన్నారు. సామాజిక సేవలో సుధామూర్తిది స్ఫూర్తిదాయక ముద్ర అని కొనియాడారు. సామాజిక సేవ, దాతృత్వం, విద్య సహా విభిన్న రంగాలకు సుధా జీ చేసిన కృషి అపారమైనదని ప్రశంసించారు. సుధామూర్తి లాంటి వ్యక్తి రాజ్యసభలో ఉండటం నారీ శక్తికి ఒక శక్తివంతమైన నిదర్శనం అని కొనియాడారు. ఎగువ సభకు నామినేట్ అయిన సుధామూర్తికి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

# ఎందెందు వెతికి చూసిన లింగ వివక్ష భూతమే !

లింగ అసమానతలు పెంచి పోషిస్తున్నది నేటి పురుషాధిక్య సమాజం. అబలను వంటింటి కుందేలుగా బందీ చేస్తున్నది మగ అహంకారం. శ్రామిక వర్గం నుంచి అత్యున్నత శాస్త్ర సాంకేతిక రంగం వరకు ఎక్కడ చూసినా లింగ వివక్ష భూతం వెక్కిరిస్తున్నది. ఆధునిక డిజిటల్ యుగంలో సహితం మహిళలు/బాలికలను చులకనగా చూస్తూ, రెండవ శ్రేణి పౌరులుగా ముద్ర వేస్తున్నది మగ అహంకారం. అనాదిగా శాస్త్ర సాంకేతిక రంగాన్ని శాసిస్తున్నారు పురుష శాస్త్రవేత్తలు. అనాదిగా పురుషులతో సమానంగా మహిళా శాస్త్రవేత్తలు కూడా అన్ని రంగాల్లో ఎదుగుతున్నప్పటికీ వారికి ఇవ్వవలసిన గౌరవం, సముచిత స్థానం ఇవ్వడానికి మగమహారాజులు వెనకడుగు వేయడం సోచనీయమే కాదు ఆక్షేపణీయం కూడా. ప్రపంచ లింగ అసమానతల సూచీ-2023 వివరాల ప్రకారం 146 దేశాల జాబితాలో భారత్‌కు 127 స్థానం లభించడంతో భారతంలోని మహిళలు పడుతున్న లింగ వివక్ష సంక్షోభం అర్థం అవుతున్నది.

## భారతంలో పలు రకాల లింగ అసమానతలు:

ఆర్థికపరమైన లింగ అసమానతల్లో ఆర్థిక స్వేచ్ఛ లేకపోవడం, సమాన పనికి సమాన వేతనంలో అసమానతలు, తండ్రి ఆస్తిలో వాటా లేకపోవడం లాంటివని మనకు అనుభవంలోకి వస్తున్నాయి. సామాజిక లింగ అసమానతల్లో వరకట్నం, మహిళలపై హింస, అక్రమ రవాణా, పడుపు వృత్తి, లైంగిక దాడులు, యాసిడ్ దాడులు, గృహ హింస, జోగినీ/దేవదాసీ వ్యవస్థలు, సరోగసి, భ్రూణ హత్యలు లాంటివి వస్తాయి. ఆరోగ్యకరమైన లింగ అసమానతల్లో బాలికలు/మహిళలకు టీకాలు తక్కువగా అందుబాటులో ఉండడం, మహిళల ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేయడం లాంటివి గమనించబడినవి. విద్యాపరమైన లింగ అసమానతల్లో పాఠశాల విద్యకు దూరంగా ఉండడం, మహిళా ఉపాధ్యాయుల కొరత, పాఠ్యాంశాల్లో లింగ వివక్ష వైఖరి, స్త్రీల అక్షరాస్యత రేటు తక్కువగా ఉండడం, మాధ్యమిక/ఉన్నత విద్యాలయ నమోదు తక్కువగా ఉండడం, రాజకీయంగా లింగ వివక్ష వెక్కిరించడం లాంటి అంశాలు వస్తాయి.

## పరిశోధనా రంగంలో మహిళలు 16 శాతం మాత్రమే:

ఇటీవల బయట పడిన వివరాల ప్రకారం మన దేశంలో 56,747 మంది మహిళాశాస్త్రవేత్తలు/పరిశోధకులు ఉన్నారని, ఇది మొత్తం పరిశోధకుల్లో 16 శాతం మాత్రమే అని తెలుసుకోవాలి. దేశ పరిశోధనారంగాల్లో మహిళలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం "వుమెన్ సైంటిస్ట్ స్కీమ్ - ఏ, డబ్ల్యూఓఎస్ - ఏ"తో పాటు "కన్‌సాలిడేషన్ ఆఫ్ యూనివర్సిటీ రీసెర్చ్ త్రూ ఇన్నొవేషన్ అండ్ ఎక్సలెన్స్ ఇన్ వుమెన్ యూనివర్సిటీస్, సియూఆర్ఐఈ", "జూజెండర్ అడ్వాన్స్‌మెంట్ ఫర్ ట్రాన్స్‌ఫామింగ్ ఇనిస్టిట్యూషన్స్, జిఏటిఐ" లాంటి నూతన పథకాలను తీసుకురావడం ఆలస్యంగానైనా కొంత ఊరటను ఇస్తున్నది. అన్ని రకాలుగా మహిళలను ప్రోత్యహించినప్పటికీ మహిళలు పరిశోధనా రంగాలను వృత్తిగా స్వీకరించి కొనసాగడంలో వెనుకబడి ఉండడం విచారకరం. కొన్ని సందర్భాల్లో మహిళా పరిశోధకురాల్లోపై ప్రయోగశాలల్లో లైంగిక వేధింపులు కూడా జరగడం సోచనీయం. ఈ ప్రతికూల పరిస్థితులను తట్టుకొని నిలబడగలిగిన స్త్రీలు మాత్రమే పరిశోధనారంగాల్లో రాణించుట చూస్తున్నాం.

## ప్రముఖ పరిశోధనాలయాల్లో కరువైన మహిళా డైరెక్టర్ జనరల్స్:

అనేక మంది భారత పురుష శాస్త్రవేత్తలు అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అద్భుతాలను ప్రపంచానికి పరిచయం చేశారు. భారత ప్రముఖ పరిశోధనల సంస్థ అయిన "కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్, సిఎస్ఐఆర్" పరిధిలో దేశవ్యాప్తంగా నెలకొన్న 38 జాతీయ పరిశోధనాలయాలు ఉండగా గత 75 ఏళ్లలో ఒక్క మహిళ కూడా ఆ సంస్థకు 2022 వరకు మహిళా డైరెక్టర్ జనరల్ పదవి రాలేదు. 2022లో తొలి సారి మన ప్రతిష్టాత్మక సిఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్‌గా మహిళామణి డా: కె. కలైసెల్వి నియామకం కావడం ఓ శుభ పరిణామమే అని చెప్పాలి. దురదృష్టవశాత్తు మన మరో ప్రతిష్టాత్మక జాతీయ ఐసిఏఆర్ సంస్థ పరిధిలో 113 పరిశోధనా సంస్థలు దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్నప్పటికీ ఆ జాతీయ సంస్థకు ఇప్పటి వరకు ఒక్క మహిళా శాస్త్రవేత్త కూడా డైరెక్టర్ జనరల్‌గా నియమించబడలేదు. అదే విధంగా దేశంలోని 24 అత్యున్నత ఐఐటీ సంస్థలకు 2022 వరకు మహిళా నిపుణులు డైరెక్టర్లుగా నియమించబడలేదు. 2023లో విదేశీ "ఐఐటీ జంజీబార్" సంస్థకు తొలి మహిళా శాస్త్రవేత్త ఆచార్య ప్రీతి అఘాలయమ్ డైరెక్టర్‌గా నియమించబడ్డారు.

## కేంద్ర ప్రభుత్వ చొరవ:

పరిశోధనారంగాల్లోకి మహిళలను ఆకర్షించడానికి "నేషనల్ సైన్స్ అకాడమీ" చొరవతో ఎన్ఐపిజిఆర్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ జీనోమ్ రీసెర్చ్) డైరెక్టర్ డా: సుబ్ర చక్రవర్తి నేతృత్వంలో "సైన్స్ ఫర్ వుమెన్ : ఏ టెక్నాలజీ అండ్ ఇన్నొవేషన్ పోర్టల్, ఎస్‌డబ్ల్యూఏటిఐ" అనబడే ఆకర్షణీయ పథకాన్ని తీసుకురావడం ఆహ్వానించదగిన పరిణామమే. ఈ పోర్టల్‌లో దేశంలోని మహిళా శాస్త్రవేత్తలు, పరిశోధకురాల్లు (అవార్డీలు, రీసెర్చ్ స్కాలర్స్, డైరెక్టర్లు, సెక్రెటరీలు, పిహెచ్‌డి స్కాలర్స్, పిజీస్, ఔత్సాహిక మహిళా వ్యాపారవేత్తలు, అంకుర సంస్థల మహిళలు, గ్రాడ్యుయేట్స్, అండర్ గ్రాడ్యుయేట్స్ లాంటి వారు) తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని, దీని ద్వారా వారికి సముచిత స్థానం దక్కుతుందని నమ్ముతున్నారు.

మహిళా పరిశోధకురాల్లు, శాస్త్రవేత్తలు తమ పరిశోధనా ఫలితాలను బహిర్గతపరుస్తూ, భారత శాస్త్రవేత్తలతో పాటు ప్రపంచ శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించి ఉన్నత స్థానాలకు చేరాలని సూచిస్తున్నారు. పురుషులతో పాటు మహిళామణుల్లో సహితం సకారాత్మక మార్పులు రావడం, అర్హతకు తగిన స్థానాలు పొందడం, ధైర్యంగా మహిళలు పరిశోధనలను కెరీర్‌గా తీసుకోవడం, తల్లితండ్రులు తమ కూతుళ్లను ప్రోత్సహించడం, పౌర సమాజం మహిళా శాస్త్రవేత్తలను గౌరవించడం లాంటివి కూడా ఏకకాల ంలో జరిగితేనే పరిశోధనాలయాల్లో లింగ వివక్ష తగ్గుతుందని, ఆ రోజులు త్వరగా రావాలని కోరుకుందాం, ఆమెలో దాగిన శాస్త్రవేత్తను జాగృత పరుద్దాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# ఇది భారత హై స్పీడ్ అనుసంధానం... రవాణా... శరవేగ శ్రేయస్సుల దశాబ్దం

న్యూఢిల్లీ, మార్చి 8: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ న్యూఢిల్లీలో గణతంత్ర శిఖరాగ్ర సదస్సు-2024లో ప్రసంగించారు. "రాబోయే దశాబ్దంలో భారతదేశం" ఇతివృత్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ- ఈ దశాబ్దం భారతదేశానిదేనని స్పష్టం చేశారు. ఇది రాజకీయ ప్రకటన కానేకాదని, ప్రపంచమంతా ఇవాళ భారత్ గురించి అనుకుంటున్నదేనని పేర్కొన్నారు. ఈ మేరకు ''ఇది భారతదేశానికి అంకితమైన దశాబ్దమని యావత్ ప్రపంచం విశ్వసిస్తోంది" అని దృఢ స్వరంతో ప్రకటించారు. ఈ సదస్సు ఇతివృత్తానికి అనుగుణంగా రాబోయే దశాబ్దపు భారతదేశంపై చర్చకు చొరవ చూపిన గణతంత్ర జట్టును ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. వికసిత భారత్ సంకల్పాలను నెరవేర్చడంలో ప్రస్తుత దశాబ్దం ఒక మాధ్యమం కాగలదని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు.

స్వతంత్ర భారతావనికి ప్రస్తుత దశాబ్దపు ప్రాముఖ్యాన్ని నొక్కిచెబుతూ- ఎర్రకోట బురుజుల నుంచి "యహీ సమయ్ హై... సహీ సమయ్ హై" (ఇదే తరుణం... సముచిత తరుణం) అంటూ తాను విజయ నాదం చేయడాన్ని ప్రధానమంత్రి గుర్తుచేసుకున్నారు. సమర్థ, వికసిత భారతదేశ పునాదుల బలోపేతం సహా ఒకనాడు అసాధ్యమని భావించిన ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి ఈ దశాబ్దమే సరైన సమయమని ఆయన ప్రస్ఫుటం చేశారు. "జాతి సామర్థ్యంతో భారత్ కలలను సాకారం చేయడంలో ఇదొక కీలక దశాబ్దం'' అని ఆయన నొక్కిచెప్పారు. వచ్చే దశాబ్దంలోగా భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పక్కా ఇళ్లు, మరుగుదొడ్లు, వంటగ్యాస్, విద్యుత్తు, నీరు, ఇంటర్నెట్ వగైరా ప్రాథమిక అవసరాలు అందరికీ అందుబాటులోకి వస్తాయని ఆయన విస్పష్టంగా ప్రకటించారు. ప్రస్తుత దశాబ్దం ఎక్స్‌ప్రెస్‌వేలు, హైస్పీడ్ రైళ్లు, దేశీయ జలమార్గాల నెట్‌వర్క్ వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి చెందినదని పేర్కొన్నారు. ఈ దశాబ్దంలోనే భారత్ తన తొలి బుల్లెట్ రైలును సమకూర్చుకుంటుందని, పూర్తిస్థాయి ప్రత్యేక సరకు రవాణా కారిడార్‌లను ఉపయోగంలోకి తెస్తుందని ఆత్మవిశ్వాసం ప్రకటించారు. దేశంలోని పెద్ద నగరాలు 'నమో' లేదా మెట్రో రైళ్లతో అనుసంధానం కాగలవని ఆయన నొక్కి చెప్పారు. "ఈ దశాబ్దం భారతదేశ హై-స్పీడ్ అనుసంధానం, రవాణా, శరవేగపు శ్రేయస్సుకు అంకితం చేయబడుతుంది" అని చెప్పారు.

ప్రపంచంలో ప్రస్తుత అనిశ్చితి-అస్థిరతలను ప్రస్తావిస్తూ- పలు ప్రపంచ దేశాల ప్రభుత్వాలు వ్యతిరేక పవనాలను ఎదుర్కొంటున్న నేటి రోజుల్లో దాని తీవ్రత-విస్తరణ రీత్యా అత్యంత తీవ్ర అస్థిరత నెలకొన్నదని నిపుణుల అభిప్రాయ పడుతున్నట్లు ప్రధాని గుర్తుచేశారు. "ఇంతటి అంతర్జాతీయ అనిశ్చితి నడుమ బలమైన ప్రజాస్వామ్య దేశమనే విశ్వసానికి భారత్ వెలుగుదివ్వెలా నిలుస్తుంది" అని ప్రధాని వ్యాఖ్యానించారు. "మంచి ఆర్థిక వ్యవస్థతో మంచి రాజకీయాలు సాధ్యమని కూడా భారత్ నిరూపించింది" అని ఆయన పేర్కొన్నారు.

భారత్ పనితీరుపై ప్రపంచవ్యాప్త ఉత్సుకతను ప్రస్తావిస్తూ-"మేము దేశ అవసరాలు తీర్చడంతోపాటు ప్రజల కలలను సాకారం చేయడంవల్లనే ఇది సాధ్యమైంది. సాధికారత కల్పన కృషిలో భాగంగా ప్రజా శ్రేయస్సుపైనా మేం దృష్టి సారించాం" అని ప్రధానమంత్రి చెప్పారు. వ్యక్తిగత ఆదాయపు పన్నును తగ్గించడంతోపాటు కార్పొరేట్ పన్ను కూడా తగ్గించడాన్ని ఆయన ఈ సందర్భంగా ఉదాహరించారు.

అలాగే ఆధునిక మౌలిక సదుపాయాల కల్పన కోసం రికార్డు స్థాయిలో పెట్టుబడులతో కోట్లాది పక్కా ఇళ్లు నిర్మించామని, దీంతోపాటు ఉచిత వైద్యం, రేషన్ కూడా అందిస్తున్నామని చెప్పారు. పరిశ్రమల కోసం 'పిఎల్ఐ' వంటి పథకాలు ఉండగా, రైతులకు బీమా, అదనపు ఆదాయార్జన మార్గాలు కల్పించామని చెప్పారు. సాంకేతికత, ఆవిష్కరణలలో పెట్టుబడుల ద్వారా యువత నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు.

దశాబ్దాలుగా అనువంశిక రాజకీయాల వల్ల దేశాభివృద్ధి విషయంలో సమయం కోల్పోవడంపై ప్రధానమంత్రి విచారం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆ లోటును భర్తీ చేసుకుంటూ వికసిత భారత్ సృష్టికోసం మునుపెన్నడూ ఎరుగని స్థాయిలో.. రెట్టింపు వేగంతో కృషి చేయాల్సి ఉందని నొక్కిచెప్పారు. ఈ మేరకు నేడు దేశంలోని అన్ని రంగాల్లో పురోగమనాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ- దేశాభివృద్ధి కృషిలో వేగం, స్థాయిని ఇనుమడింప జేయడంపైనే తాను ప్రధానంగా దృష్టి కేంద్రీకరించానని చెప్పారు. గడచిన 75 రోజుల్లో దేశవ్యాప్తంగా పరిణామాలను ప్రస్తావిస్తూ- దాదాపు రూ.9 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం వగైరా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. అంటే- 110 బిలియన్ అమెరికన్ డాలర్లకు పైగా విలువైన ప్రాజెక్టులు ప్రజల కోసం సిద్ధమవుతున్నాయని ప్రధాని వివరించారు. ఆధునిక మౌలిక సదుపాయాల కల్పన దిశగా గత 75 రోజుల్లో పెట్టిన పెట్టుబడులు అనేక ప్రపంచ దేశాల వార్షిక బడ్జెట్ కన్నా అధికమని ఆయన వివరించారు. ఈ 75 రోజుల్లో దేశవ్యాప్తంగా 7 కొత్త 'ఎయిమ్స్', 3 ఐఐఎంలు, 10 ఐఐటీలు, 5 ఎన్ఐటీలు, 3 ఐఐఐటీలు, 2 'ఐసిఆర్'లు 10 కేంద్ర సంస్థలు, 4 వైద్య/నర్సింగ్ కళాశాలలు, 6 జాతీయ పరిశోధన ప్రయోగశాలల ప్రారంభం లేదా శంకుస్థాపన చేసినట్లు ప్రధానమంత్రి వెల్లడించారు.

అంతేకాకుండా అంతరిక్ష మౌలిక సదుపాయాల రంగంలో రూ.1800 కోట్ల విలువైన ప్రాజెక్టులు, 54 విద్యుత్తు ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేయబడ్డాయి. కాక్రపార్ అణు విద్యుత్తు ప్లాంటులో 2 కొత్త రియాక్టర్లు జాతికి అంకితం చేయబడ్డాయి. కల్పక్కంలో స్వదేశీ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ కోర్ లోడింగ్ ప్రారంభించబడింది, తెలంగాణలో 1600 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ ప్రారంభించబడింది. జార్ఖండ్‌లో 1300 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంటును ప్రారంభించగా, 1600 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. ఉత్తరప్రదేశ్‌లో 300 మెగావాట్ల సౌరశక్తి ప్లాంటు, మెగా పునరుత్పాదక విద్యుదుత్పాదన పార్క్, హిమాచల్‌లో జలవిద్యుత్ ప్రాజెక్ట్ ప్రారంభమయ్యాయి. అలాగే దేశంలోనే తొలి హరిత ఉదజని ఇంధన సెల్ నౌక తమిళనాడులో ప్రారంభించబడింది. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్-సింభవాలి విద్యుత్ ప్రసార లైన్లతోపాటు కర్ణాటకలోని కొప్పల్‌లోని పవన విద్యుత్ మండలి నుంచి ప్రసార లైన్లను ప్రధాని ప్రారంభించారు.

వీటితోపాటు గత 75 రోజుల్లో దేశంలోనే అత్యంత పొడవైన కేబుల్ వంతెనను, లక్షద్వీప్ వరకూ సముద్రగర్భంలో ఆప్టికల్ కేబుల్ లైన్ ప్రారంభించామని తెలిపారు. దేశంలోని 500కిపైగా రైల్వే స్టేషన్ల ఆధునికీరణకు శ్రీకారం చుట్టామని, 33 కొత్త రైళ్లను ప్రారంభించామని ఆయన తెలిపారు. రహదారులు, ఓవర్‌బ్రిడ్జీలు, అండర్‌పాస్‌లు వంటి 1500కుపైగా ప్రాజెక్టులు ప్రారంభించబడ్డాయని వివరించారు. దేశంలోని 4 నగరాల్లో 7 మెట్రో సంబంధిత ప్రాజెక్టులు ప్రారంభించగా, కోల్‌కతాకు దేశంలోనే తొలి జలాంతర మెట్రో రైలుమార్గం కానుకగా లభించిందన్నారు. అంతేకాకుండా రూ.10,000 కోట్లతో 30 ఓడరేవుల అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశామన్నారు. రైతుల కోసం ప్రపంచంలోనే అతిపెద్ద నిల్వ పథకానికి శ్రీకారం చుట్టడంసహా 18 వేల సహకార సంఘాల కంప్యూటరీకరణ పూర్తిచేశామన్నారు. అలాగే రూ.21 వేల కోట్లకు పైగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు.

పాలనలో వేగం గురించి ప్రస్తావిస్తూ- బడ్జెట్‌లో ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనను ఆమోదించి, ప్రారంభించేందుకు పట్టిన సమయం కేవలం 4 వారాలేనని ప్రధాని నొక్కిచెప్పారు. పాలనలో ఈ వేగాన్ని, స్థాయిని పౌరులు నేడు ప్రత్యక్షంగా చూస్తున్నారని చెప్పారు. అలాగే రాబోయే 25 ఏళ్ల ప్రగతి ప్రణాళిక గురించి కూడా ప్రధాని మోదీ వెల్లడించారు. దేశంలో ప్రస్తుత ఎన్నికల వాతావరణ నడుమ ప్రతి సెకను సమయాన్ని పరిగణనలోకి తీసుకుంటూ అభివృద్ధి పనులు సాగుతున్నాయని చెప్పారు. "గత 10 సంవత్సరాల్లో ప్రజలు నినాదాలకు బదులు పరిష్కారాలను చూశారు" అని ప్రధాని మోదీ సగర్వంగా ప్రకటించారు. ఆహార భద్రత, ఎరువుల కర్మాగారాల పునరుద్ధరణ, విద్యుదీకరణ, సరిహద్దుల్లో మౌలిక సదుపాయాల బలోపేతం, పక్కా ఇళ్లకు భరోసా నుంచి ఆర్టికల్ 370 రద్దు వరకూ అన్ని ప్రాథమ్యాలపైనా ప్రభుత్వం ఏకకాలంలో కృషి చేస్తోందని ప్రధాని చెప్పారు.

గత పదేళ్లలో ప్రశ్నల స్వభావంలో వచ్చిన మార్పును ప్రధాని మోదీ ప్రస్తావించారు. జాతీయ ఆర్థిక వ్యవస్థలపై నిరాశావాద ప్రశ్నలు కాస్తా నేడు- అత్యాధునిక సాంకేతికత కోసం ఎదురుచూపుల నుంచి డిజిటల్ చెల్లింపులలో నాయకత్వందాకా... నిరుద్యోగం నుంచి అంకుర సంస్థల వరకూ... ద్రవ్యోల్బణం నుంచి ప్రపంచ సంక్షోభానికి మినహాయింపుదాకా... మన దేశం మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా వేగవంతమైన అభివృద్ధి వరకూ ఆశావహ, ఆసక్తికర ప్రశ్నలుగా మారాయి. అలాగే కుంభకోణాలు, సంస్కరణలు, ఆర్టికల్ 370 రద్దుతో జమ్ముకశ్మీర్ ఆర్థిక వ్యవస్థలో పురోగమనం నేపథ్యంలో నిస్సహాయత నుంచి ఆశావాదం వరకూ ప్రశ్నలలో వచ్చిన మార్పును ఆయన ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ఇవాళ ఉదయం తన శ్రీనగర్ పర్యటనను గుర్తుచేసుకుంటూ జమ్ముకశ్మీర్‌లో మానసిక ధోరణి రూపాంతరం చెందిన తీరును వివరించారు.

దేశానికి భారంగా ఒకనాడు పరిగణించబడిన వారిపై ప్రభుత్వం దృష్టి సారించడాన్ని ప్రధాని గుర్తుచేశారు. ఆకాంక్షాత్మక జిల్లాలను ఉదాహరిస్తూ- ఈ జిల్లాల్లోని ప్రజల దురదృష్టంతో ముడిపెట్టబడిన జీవన దుస్థితిని ప్రస్తుత ప్రభుత్వం తన విధానాలు, ఆలోచనలతో పరిష్కరించి వారి తలరాతను మార్చిందని తెలిపారు. ఇదే తరహా విధానాల ద్వారా సరిహద్దు గ్రామాలు, దివ్యాంగులు రూపాంతరం చెందారని, సంకేత భాష ప్రామాణీకరణ చేపట్టామని ఆయన తెలిపారు. అవగాహన గల ప్రభుత్వం లోతైన విధాన అనుసరణ, ఆలోచనతో ముందడుగు వేస్తుందని ఆయన అన్నారు. విస్మృత, అణగారిన వర్గాలపై దృష్టి సారిస్తూ, సంచార-పాక్షిక సంచార జనాభా, వీధి వ్యాపారులు, విశ్వకర్మల సంక్షేమం దిశగా తీసుకున్న చర్యలను కూడా ప్రధానమంత్రి ఉటంకించారు. విజయ పథంలో కృషి, దృక్పథం, సంకల్పాల పాత్రను ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. ఈ మేరకు "ప్రగతి ప్రయాణంలో భారత్ కూడా శరవేగంగా దూసుకెళ్తోంది. ఆ మేరకు రాబోయే దశాబ్దంలో భారతదేశం అపూర్వ, అనూహ్య సమున్నత శిఖరాలకు చేరగలదు... ఇది మోదీ గ్యారంటీ కూడా" అని ప్రకటిస్తూ ప్రధాని తన ప్రసంగం ముగించారు.

# ప్రధానమంత్రి ఉజ్వల యోజన వినియోగదార్లకు రూ.300 రాయితీ కొనసాగింపునకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం

న్యూఢిల్లీ, మార్చి 8:ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై) లబ్ధిదార్లకు శుభవార్త అందింది. పీఎంయూవై లబ్ధిదార్లకు 2024-25 ఆర్థిక సంవత్సరంలోనూ రాయితీ అందించడానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గం అంగీకరించింది. సంవత్సరానికి 12 సిలిండర్ల వరకు, 14.2 కిలోల సిలిండర్‌కు రూ.300 చొప్పున (5 కిలోల సిలిండర్‌కు దామాషా ప్రకారం) రాయితీ కొనసాగుతుంది. 01 మార్చి 2024 నాటికి, 10.27 కోట్లకు పైగా పీఎంయూవై లబ్ధిదార్లు ఉన్నారు.

2024-25 ఆర్థిక సంవత్సరానికి మొత్తం వ్యయం రూ.12,000 కోట్లు. రాయితీని అర్హులైన లబ్ధిదార్ల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమ చేస్తారు.

శుద్ధమైన వంట ఇంధనమైన ద్రవీకృత పెట్రోలియం గ్యాస్‌ను (ఎల్‌పీజీ) గ్రామీణ ఉ నిరుపేద పేద కుటుంబాలకు అందుబాటులో ఉంచడానికి, పేద కుటుంబాల మహిళలకు డిపాజిట్-రహిత ఎల్‌పీజీ కనెక్షన్ అందించడానికి కేంద్ర ప్రభుత్వం 2016 మే నెలలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన ప్రారంభించింది.

మన దేశం, మొత్తం ఎల్‌పీజీ అవసరాల్లో 60% దిగుమతి చేసుకుంటోంది. ఎల్‌పీజీ అంతర్జాతీయ ధరల్లో హెచ్చుతగ్గుల ప్రభావం నుంచి పీఎంయూవై లబ్ధిదార్లకు రక్షణ కల్పించడానికి, వంట గ్యాస్‌ను మరింత తక్కువ ధరలో అందుబాటులో ఉంచడానికి రాయితీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. 2022 మే నెలలో ప్రారంభమైన ఈ పథకం ద్వారా, తొలుత, ఒక్కో 14.2 కిలోల సిలిండర్‌కు రూ.200 చొప్పున రాయితీ ఇచ్చింది. పీఎంయూవై వినియోగదార్లకు సంవత్సరానికి 12 సిలిండర్ల వరకు (5 కిలోల సిలిండర్‌కు దామాషా ప్రకారం) రాయితీ వర్తిస్తుంది. 2023 అక్టోబర్‌లో, సంవత్సరానికి 12 సిలిండర్ల వరకు, ఒక్కో 14.2 కేజీల సిలిండర్‌పై రాయితీని రూ.300కు పెంచింది. ఈ రాయితీ పోను, 01.02.2024 నాటికి, పీఎంయూవై వినియోగదార్లకు 14.2 కేజీల సిలిండర్‌కు రూ.603 (ఢిల్లీ ధర) అందుబాటులోకి వచ్చింది.

# మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇచ్చే వరకు ఆగదీ పోరాటం- ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, మార్చి 8: అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు ధర్నా చేయాల్సి రావడం సిగ్గుచేటని ఎమ్మెల్సీ కవిత అన్నారు. సంతోషంగా సంబురాలు చేసుకునే ఉమెన్స్ డే రోజున ఆడబిడ్డల ఉద్యోగాలకై ధర్నాలు చేసే దౌర్భాగ్యపు స్థితిని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. బాబా సాహెబ్ అంబేద్కర్ మహిళలకు అనేక హక్కులు కల్పించారని చెప్పారు. ప్రభుత్వ నియామకాల్లో మహిళలకు జరుగుతున్న అన్యాయానికి నిరసనగా ఇవాళ హైదరాబాద్ ధర్నా చౌక్‌లో ఎమ్మెల్సీ కవిత దీక్ష చేపట్టారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చిన తర్వాత 33శాతం రిజర్వేషన్‌ను పెంచుకున్నామన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు లక్షకు పైగా ఉద్యోగాలు మహిళలకు ఇచ్చామని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాల విషయంలో మాట తప్పిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వ్యక్తిగతంగా చనిపోయిన ఆడబిడ్డలను అడ్డుపెట్టుకుని రేవంత్ రెడ్డి రాజకీయం చేశారని విమర్శించారు. ఓటుకు నోటు కేసులో దొరికిన వ్యక్తి మహిళల ఉద్యోగాల విషయంలో కోత విధించారన్నారు. వికలాంగులు, మహిళలకు తోడు ఉండకుండా ఎవరికి తోడు ఉంటున్నారో చెప్పాలని రేవంత్ ను నిలదీశారు కవిత. మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

మహిళలను కాస్త ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని చెప్పారు. ఆడబిడ్డలకు అన్యాయం జరిగే ఏ ఒక్క కార్యక్రమం బీఆర్ఎస్ చేయలేదని వెల్లడించారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం ఆడపిల్లలకు వ్యతిరేకంగా జీవో 3 తెచ్చిందని విమర్శించారు. ఈ జీవో వల్ల ఉద్యోగాల్లో అమ్మాయిలకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం వెంటనే ఈ జీవోను రద్దుచేసి, హైకోర్టులు పిటిషన్ వేయాలని డిమాండ్ చేశారు.

# 'కలలకు రెక్కలు' కార్యక్రమాన్ని ప్రారంభించిన నారా భువనేశ్వరి



అమరావతి, మార్చి 8:నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా నారా భువనేశ్వరి కర్నూలు జిల్లా పత్తికొండలో పర్యటిస్తున్నారు. ఇంటర్ పూర్తి చేసుకుని ఉన్నత చదువులకు వెళ్ళాలి అనుకునే విద్యార్థినుల కోసం 'కలలకు రెక్కలు' అనే కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ పథకం కింద ప్రొఫెషనల్ కోర్సు లు నేర్చుకునే విద్యార్థినులకు ప్రభుత్వ గ్యారెంటీ తో బ్యాంక్ రుణాలు, విద్యార్థినులు బ్యాంక్ నుంచి పొందే రుణాలకు వడ్డీ పూర్తిగా ప్రభుత్వమే చెల్లించేలా కొత్త కార్యక్రమాన్ని నారా భువనేశ్వరీ ప్రకటించారు. టీడీపీ ? జనసేన అధికారంలోకి వచ్చిన తరువాత ఉమ్మడి ప్రభుత్వంలో కలలకు రెక్కలు కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో పత్తికొండ నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి, కెఇ శ్యామ్ బాబు మాట్లాడుతూ మీకోసం ఎవరు పనిచేస్తారనుకుంటారో వారినే ప్రజలు ఎన్నుకోవాలన్నారు. తాయిల ాలు, ఆకర్షించే మాటలకు లొంగి మీ జీవితాన్ని పాడుచేసుకోవద్దని హితవు పలికారు. తెలుగుదేశం-జనసేన ప్రభుత్వంతో యువతకు బంగారు భవిష్యత్తు గ్యారెంటీగా ఉంటుందన్నారు. నారా లోకేష్ సారథ్యంలో యువతకు అవకాశాలు, ఉద్యోగాలు మెండుగా వస్తాయన్నారు. రానున్న ఎన్నికల్లో యువత మీ భవిష్యత్తుకు ఓటు వేయాలని మనవి చేశారు.

కర్నూలు జిల్లా పార్టీ అధ్యక్షులు బీటీ నాయుడు మాట్లాడుతూ ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించాన్నారు. చంద్రబాబు ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా యువతను, మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించారన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం యువతను, మహిళలను అణగదొక్కుతోందన్నారు. జగన్మోహన్ రెడ్డి ఓట్లను దొంగతనం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఓట్లు దొంగతనం చేసి, రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకుంటున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి వంటి దుర్మార్గులకు బుద్ధి చెప్పాలంటే ఓటే మనకు వజ్రాయుధమన్నారు. ఓటుతోనే శత్రువులను ధీటుగా ఎదుర్కొని, సంక్షేమ పాలనకు పట్టం కట్టాలన్నారు.

టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఎంపీ సీటు కోసం బాబాయ్ నే చంపేశాడన్నారు.

నారా లోకేష్ పాదయాత్ర చేస్తానని చెప్పిన సమయంలో భువనేశ్వరి చాలా ఆవేదన చెందారన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం నారా లోకేష్‌ను భువనేశ్వరి ఆశీర్వదించి పాదయాత్రకు పంపించారన్నారు. చంద్రబాబు కష్టకాలంలో ఉన్న సమయంలో ఆ విషయాన్ని తట్టుకోలేక మృతిచెందిన పార్టీ కుటుంబ సభ్యులను నేరుగా వెళ్లి పరామర్శించి, వారికి తోడుగా నిలుస్తున్నారనీ తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా భువనేశ్వరి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని పేర్కొన్నారు. భువనేశ్వరి కష్టపడే మనస్తత్వం కలిగిన మహిళగా నేటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. దుర్మార్గుల పాలనను ఎదుర్కొనేందుకు ఓటును ప్రతి ఒక్కరూ ఆయుధంగా మలచుకోవా లన్నారు. చంద్రబాబు మహిళలు, రైతులు, యువతకు అందించిన సంక్షేమ కార్యక్రమాలు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ఓటు వేసే ముందు ఎవరికి ఓటు వేస్తున్నాం, ఎందుకు వేస్తున్నాం అనేది ఆలోచించి ఓటు వేయాలన్నారు.

# తాను పార్టీ మారడం లేదు.. -మాజీ మంత్రి మల్లారెడ్డి

హైదరాబాద్ మార్చ్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మాజీ మంత్రి మల్లారెడ్డి శుక్రవారం కలిశారు. మల్లారెడ్డితో పాటు ఆయన కుమారుడు భద్రారెడ్డి కూడా వెళ్లారు. లోక్‌సభ ఎన్నికల్లో తాను పోటీ చేయడం లేదని భద్రారెడ్డి కేటీఆర్‌కు తెలిపినట్లు సమాచారం. మరో వైపు గురువారం సీఎం రేవంత్ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలవడంపై మల్లారెడ్డి కేటీఆర్‌కు వివరణ ఇచ్చారు. తన అల్లుడు రాజశేఖర్ రెడ్డికి చెందిన కాలేజీ భవనాల కూల్చివేత అంశంపై కలిసినట్లు పేర్కొన్నారు. తాను పార్టీ మారడం లేదని మల్లారెడ్డి స్పష్టం చేశారు. గత నెలలో మల్లారెడ్డి మీడియాతో మాట్లాడుతూ మల్కాజ్‌గిరి ఎంపీ స్థానానికి తన కుమారుడు భద్రారెడ్డి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపిన విషయం తెలిసిందే.

# ఎస్సారెస్పీ కాలువలో.. ముగ్గురు యువకుల గల్లంతు..

నిజామాబాద్, మార్చి 8:ఎస్సారెస్పీ కాలువలో పడి ముగ్గురు యువకులు గల్లంతైన ఘటన తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లా మెండోరా మండల పరిధిలో ఘోరం జరిగింది. ఎస్సారెస్పీ లక్ష్మీ కాలువలో పడి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. మండల పరిధిలోని జాక్రాన్‌పల్లి గన్యతండాకు చెందిన లోకేష్, సాయినాథ్, మున్నాలు ఆటవిడుపుగా ఎస్సారెస్పీ లక్ష్మీ కాలువలోకి దిగారు.

ఈ క్రమంలో ఈత రాని వారు నీటిలో పడి గల్లంతయ్యారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరకున్న రెస్క్యూ టీం ముగ్గురు యువకులు ఆచూకీ కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.


## ఆహ్వానం

2023 ఫీచర సునీతా రావు తృతీయ వార్షిక స్మారక సాహిత్య పురస్కార ప్రధానోత్సవం

తేది : 10-03-2024 ఆదివారం ఉ॥10.30 నిలకు
వేదిక : రవీంద్ర భారతి పైడి జయరాజ్ హాల్ రెండవ ఫ్లోర్

సభాధ్యక్షులు
సుంకిరెడ్డి నారాయణరెడ్డి, ప్రముఖ సాహితీ వేత్త

ముఖ్య అతిథి
నందిని సిధారెడ్డి
సాహిత్య అకాడమీ తొలి చైర్మన్

ప్రత్యేక అతిథులు :
అమ్మంగి వేణుగోపాల్, ప్రభుత్వ తొలి కాళోజి అవార్డు గ్రహీత
మామిడి హరికృష్ణ, తెలంగాణ ప్రభుత్వ కల్చరల్ డైరెక్టర్
కాసుల ప్రతాపరెడ్డి, ప్రముఖ విమర్శకులు, కథకులు
కెపి అశోక్ కుమార్, ప్రముఖ విమర్శకులు, కథకులు
విహారి, ప్రముఖ సాహితీవేత్త
వేముగంటి మురళీకృష్ణ, ప్రముఖ కవి కమిటీ సలహాదారులు
పి రవీందర్రావు, ఇంజనీర్ చీఫ్ భవనాలు రహదారులు

పురస్కార గ్రహీతలు
కవిత్వం, గజ్జల రామకృష్ణ దీపం ఉండగానే
కథ, చింతకింది శ్రీనివాస్ ఉడుకు బెల్లం
విమర్శ, ఆదెపు లక్ష్మీపతి దిక్ చక్రం, లక్షణ చక్రవర్తి షట్ చక్రం,

అభినందనలతో
పి. శ్రీనివాసరావు, జె. గౌతమ్ రావు, పి. అమరేందర్ రావు, పి. వెంకట నరసింహారావు, టి మన్మోహన్ రావు, జె బాలచందర్, పి నాగేందర్ రావు, రాజ మహేందర్ రెడ్డి వెంకటరమణ.

కార్యక్రమం అనంతరం భోజనం - అందరూ ఆహ్వానితులే

కాంచనపల్లి గోవర్ధన్ రాజు
పురస్కార కమిటీ కన్వీనర్

పి విజయేందర్ రావు
ఫీచర సునీతారావు ఫౌండేషన్ చైర్మన్.

# కృషి సఖి కన్వెర్జెన్స్ కార్యక్రమం ప్రారంభించిన కేంద్ర మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్

న్యూఢిల్లీ, మార్చి 8:న్యూ ఢిల్లీలోని కృషి భవన్ లో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ గిరిరాజ్ కిశోర్ తో కలిసి ఉమ్మడిగా నిర్వహించిన ఒక సమావేశంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అర్జున్ ముండా వ్యవసాయ రంగానికి చెందిన మూడు ప్రధాన సదుపాయాలు ప్రారంభించారు. అవి పునర్నవీకరించిన సాయిల్ హెల్త్ కార్డ్ పోర్టల్ అండ్ మొబైల్ అప్లికేషన్; స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రామ్, ఎరువుల శాంపిల్ టెస్టింగ్ కోసం సెంట్రల్ ఫర్టిలైజర్ క్వాలిటీ కంట్రోల్ అండ్ ట్రెనింగ్ ఇన్ స్టిట్యూట్ పోర్టల్. ఇదే కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఉమ్మడిగా చేపట్టిన కృషి సఖి కన్వెర్జెన్స్ కార్యక్రమం కూడా ప్రారంభించారు.

దేశంలోని ప్రత్యేకించి మారుమూల ప్రాంతాల్లోని రైతులకు ప్రయోజనం కల్పించడం, వారు తెలిగ్గా వ్యవసాయం చేసుకునేందుకు తోడ్పడడం వీటి ప్రధాన లక్ష్యమని ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ శ్రీ అర్జున్ ముండా తెలిపారు. ఇలాంటి సదుపాయాలన్నింటి వాళ్ళ రైతులు సాధికారం అవుతారని, తద్వారా వారు తమకు, దేశానికీ, ప్రపంచానికి కీలకమైన సేవలు అందించగలుగుతారని మంత్రి అన్నారు. సహకారం ద్వారా సుసంపన్నత అనే మౌలిక మంత్రంతో సహకారం ఆధారిత భారతదేశాన్ని నిర్మించడం కోసం ప్రభుత్వం ఈ కృషి చేస్తున్నదని అయన చెప్పారు.

భూమి ప్రాధాన్యతను శ్రీ అర్జున్ ముందా ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ నేల మన తల్లి (భూమాత) అని సర్వ ప్రాణుల సంక్షేమం కోసం భూసార స్వస్థతను కాపాడవలసిన బాధ్యత మనందరిపై ఉన్నదని చెబుతూ భూసారం మెరుగైన నిర్వహణలో కృషి సఖి పాత్ర కీలకమని అయన చెప్పారు. ప్రధానమంత్రి నాయకత్వంలో ఈ గొప్ప శక్తి ఏర్పటయిందని, ఇది భూసారంపై రైతులను విద్యావంతులను చేస్తుందని అన్నారు. మహిళా సాధికారత ద్వారా అర్థవంతమైన ఫలితాలు సాధిస్తూ లక్ష్యం దిశగా అడుగులు వేస్తున్నామని మంత్రి తెలిపారు. భూసార పరిరక్షణలో విద్యార్థులు పాత్రను కూడా అయన ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ ఉద్దేశంతోనే భూసారం, పర్యావరణంపై విద్యార్థులకు మార్గదర్శకం చేసేందుకు స్కూల్ సాయిల్ హెల్త్ కార్యక్రమం ప్రవేశపెట్టామన్నారు. ఈ కార్యక్రమం కింద గ్రామీణ ప్రాంతాల్లోని కొన్ని కేంద్రీయ, నవోదయ విద్యాలయాల్లో సాయిల్ ల్యాబ్ లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తాము నివసిస్తున్న గ్రామాల అభివృద్ధిలోను, వ్యవసాయ అభివృద్ధిలోను భాగస్వాములయ్యేందుకు వీలుగా శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు.

కృషి సఖిలను "పారా ఎక్స్ టెన్షన్ వర్కర్స్" గా సర్టిఫై చేసేందుకు ఉమ్మడి చొరవగా కృషి సఖి శిక్షణ కార్యక్రమం ప్రారంభించినట్టు శ్రీ గిరిరాజ్ సింగ్ ఈ సందర్భంగా తెలిపారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి భూమి స్వస్థతకు అధిక ప్రాధాన్యత ఇచ్చినందుకు ప్రధానమంత్రి శ్రీ మోదీకి అయన కృతజ్ఞతలు తెలిపారు. కృషి సఖి, డ్రోన్ దీదీ వంటి కార్యక్రమాల రూపంలో ఒక అపూర్వమైన శక్తి దేశ శ్రేయస్సు కోసం పని చేస్తున్నట్టు శ్రీ సింగ్ చెప్పారు. భూసారాన్ని ఆరోగ్యవంతంగా ఉంచడంలో సాయిల్ ఆర్గానిక్ కార్బన్ పాత్ర గురించి నొక్కి చెబుతూ భూమి, పశు సంపద ఆరోగ్యం బాగుంటే మానవుల ఆరోగ్యం కూడా దానికదే మెరుగు పడుతుందని అయన అన్నారు.

నేడు ప్రారంభించిన సదుపాయాల ద్వారా వాస్తవిక డేటా కూడా అందుబాటులో ఉంటుందని శ్రీ గిరిరాజ్ సింగ్ అన్నారు. సుస్థిర వ్యవసాయ విధానాల గురించి రైతులను చైతన్యవంతులను చేయడంలో కృషి సఖిల పాత్ర గురించి ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. కృషి సఖీలు వ్యవసాయానికే ప్రయోజనం కలిగించడమే కాకుండా సమాజం విశ్వసనీయతను, వ్యవసాయదారుల విశ్వాసం పెంచడంలోనూ కీలకంగా నిలుస్తారని అయన చెప్పారు. యావత్ మానవాళి సంక్షేమం కోసం ఆర్గానిక్, ప్రకృతి వ్యవసాయ విధానాలు వినియోగించాలని అయన సలహా ఇచ్చారు. రాబోయే రోజుల్లో ఆర్గానిక్ ఉత్పత్తుల మార్కెట్ గణనీయంగా పెరుగుతుందన్న ఆశా భావం ఆయన ప్రకటించారు. ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో కృషి విజ్ఞాన కేంద్రాల పాత్ర అధికంగా ఉండాలని అయన కోరారు. వ్యవసాయ శాఖకు చెందిన సంస్థలు కర్షన వ్యర్థాలకు సంబంధిన వాస్తవిక సమాచారం కూడా అందుబాటులో ఉంచాలని కేంద్ర మంత్రి శ్రీ సింగ్ సూచించారు. ఈ సదుపాయాల ద్వారా ప్రధానమంత్రి కళలు నూరు శాతం సాకారం చేసేందుకు కృషి చేస్తున్నట్టు అయన చెప్పారు.

పునరుద్ధరించిన సాయిల్ హెల్త్ కార్డ్ పోర్టల్, మొబైల్ అప్లికేషన్ : సాయిల్ హెల్త్ కార్డులను పునరుద్ధరించడంతో పాటు నేల శాంపిల్స్ సేకరించి పరీక్షించడానికి మొబైల్ అప్లికేషన్ ఒకటి ప్రారంభించారు. పోర్టల్ లో సాయిల్ లాబ్ రిజిస్ట్రీ ఉంటుంది. వాస్తవిక ప్రాతిపదికపై లాబ్ ల తాజా స్థితిని వీక్షించవచ్చు. పోర్టల్ పై జియో కోఆర్డినేట్స్ ఆధారంగా లాబ్ లను మ్యాప్ చేయవచ్చు. అలాగే సాయిల్ శాంపిల్ సేకరణ, లాబ్ లలో పరీక్షలకు సంబంధించిన వాస్తవిక డేటాను కూడా తెలుసుకోవడంతో పాటు సాయిల్ హెల్త్ కార్డులను రూపొందించుకోవచ్చు. సాయిల్ హెల్త్ కార్డ్ మొబైల్ అప్లికేషన్ లోని క్యుఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా శాంపిల్ సేకరణ విధానం ప్రవేశపెట్టారు. కొత్త పోర్టల్ లో జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో సెంట్రలైజ్డ్ డాష్ బోర్డ్ లు ఏర్పాటు చేశారు. వాస్తవిక ప్రాతిపదికన జియోగ్రాఫిక్ సమాచార వ్యవస్థ (జిఐఎస్) అనలిటిక్స్ ను ప్రవేశపెట్టారు. రైతులు ఎస్ఎంఎస్ నోటిఫికేషన్ ద్వారా పోర్టల్ లో మొబైల్ నంబర్ ఎంటర్ చేసి సాయిల్ హెల్త్ కార్డులు (ఎస్ హెచ్ సి) డౌన్ లోడ్ చేసుకోవచ్చు. పోర్టల్ లో ఎరువుల నిర్వహణ, ఎమోజీల ఆధారిత సాయిల్ హెల్త్ కార్డులు, పోషకాలకు సంబంధించిన డాష్ బోర్డు, పోషకాలకు సంబంధించిన హీట్ మ్యాప్ లు కూడా అందుబాటులో ఉంటాయి. ఇప్పుడు వాస్తవిక ప్రాతిపదికన పురోగతిని కూడా పర్యవేక్షించుకోవచ్చు. రైతుల జియో కోఆర్డినేట్స్ సహాయంతో శాంపిల్స్ సేకరించిన ప్రదేశాలను కూడా మొబైల్ అప్లికేషన్ ద్వారా ఆటోమేటిక్ గా కాప్చర్ చేయవచ్చు. ప్లాట్ వివరాలను కూడా యాప్ నమోదు చేస్తుంది. ఆన్ లైన్, ఆఫ్ లైన్ లో కూడా ఇది పని చేస్తుంది. సాయిల్ హెల్త్ కార్డ్ జనరేట్ చేసుకునే వరకు రైతులు తమ సాయిల్ శాంపిల్ స్థితిని ట్రాక్ చేసుకోవచ్చు.

స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రామ్ : పాఠశాల, అక్షరాస్యత విద్యా శాఖ సహకారంతో స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రామ్ పేరిట ఒక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం కింద గ్రామీణ ప్రాంతాల్లోని 20 కేంద్రీయ, నవోదయ విద్యాలయ పాఠశాలల్లో 20 సాయిల్ లాబ్ లు ఏర్పాటు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల కోసం స్టడీ మాడ్యూల్స్ రూపొందించి విద్యార్థులు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. మొబైల్ అప్లికేషన్ ను పాఠశాల ప్రోగ్రామ్ కు అనుగుణంగా కస్టమైజ్ చేశారు. విద్యార్థులు నిర్వహిస్తున్న అన్ని కార్యక్రమాలను డాక్యుమెంట్ చేస్తూ పోర్టల్ లో ఈ ప్రోగ్రామ్ కు చెందిన ప్రత్యేక విభాగం ఉంది. ఇప్పుడు ఈ ప్రోగ్రామ్ ను 1000 పాఠశాలలకు విస్తరించారు. కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, ఏకలవ్య మోడల్ పాఠశాలలను ఈ ప్రోగ్రామ్ పరిధిలోకి తెచ్చారు. పాఠశాలలను పోర్టల్ లో చేర్చుకుని ఆన్ లైన్ బాచ్ లు ఏర్పాటు చేస్తున్నారు. డిఏఎఫ్ డబ్ల్యు శాఖ జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నబార్డ్) సహాయంతో ఈ పాఠశాలల్లో సాయిల్ లాబ్ లు ఏర్పాటు చేస్తారు. పాఠశాల విద్యార్థులు భూమి శాంపిల్స్ సేకరించి పాఠశాలల్లో ఏర్పాటు చేసిన లాబ్ లలో పరీక్షించి సాయిల్ హెల్త్ కార్డులను రూపొందిస్తారు.

సాయిల్ హెల్త్ కార్డులను రూపొందించిన అనంతరం వారు రైతుల వద్దకు వెళ్లి సాయిల్ హెల్త్ కార్డుల సిఫారసులపై రైతులను విద్యావంతులను చేస్తారు. విద్యార్థులు ప్రయోగాలు నిర్వహించడానికి, మట్టి శాంపిల్స్ ను విశ్లేషించడానికి, మట్టిలోని అద్భుతమైన జీవవైవిధ్యాన్ని అన్వేషించేందుకు ఈ కార్యక్రమం అవకాశం కల్పిస్తుంది. ప్రాక్టికల్ కార్యకలాపాల ద్వారా విద్యార్థులు కీలకమైన ఆలోచనా నైపుణ్యాలు, సమస్యల పరిష్కార సామర్థ్యాలు, విభిన్న వాతావరణ వ్యవస్థల మధ్య పరస్పర అనుసంధానత వంటి అంశాలపై అవగాహన పొందుతారు. అంతే కాదు, సాయిల్ లాబ్ ప్రోగ్రామ్ కేవలం శాస్త్రీయ అన్వేషణలకే కాదు..పర్యావరణ పట్ల బాధ్యతాయుత వైఖరి, పర్యావరణ పట్ల గౌరవ భావం అలవరచుకునేందుకు కూడా సహాయపడుతుంది. సుస్థిర వ్యవసాయ విధానాలు, భూమి ఆరోగ్యంపై మానవ కార్యకలాపాల ప్రభావం, మన పర్యావరణ వ్యవస్థల్లోని సునిశితమైన సమతూకాన్ని కాపాడడంలో మనలో ప్రతీ ఒక్కరి పాత్ర వంటి అంశాలపై విద్యార్థులు నేర్చుకునేందుకు కూడా ఇది సహాయపడుతుంది.

కృషి సఖి కన్వర్జెన్స్ ప్రోగ్రామ్ : గ్రామీణ భారతం నడిబొడ్డులో ఒక మౌన విప్లవం చోటు చేసుకుంటోంది. గ్రామీణ పరివర్తనకు కృషి సఖిలు చోదక శక్తిగా ఉన్నారు. ఈ విప్లవాన్ని మరింత ముందుకు నడపడం కోసం వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ; గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ మధ్య సమన్వయాన్ని మరింత విస్తరించే దిశలో తమ శాఖలు నిర్వహిస్తున్న కార్యక్రమాలన్నింటినీ సమన్వయపరిచేందుకు ఉభయ శాఖలు 2023 ఆగస్టు 30వ తేదీన ఒక ఎంఓయుపై సంతకాలు చేశాయి. ఈ ఎంఓయులో భాగంగానే కృషి సఖి శిక్షణా కార్యక్రమం ప్రవేశపెట్టారు. 70,000 మంది కృషి సఖిలను "పారా-ఎక్స్ టెన్షన్ కార్యకర్తలు"గా సర్టిఫై చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. జాతీయ ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం (ఎన్ఎంఎన్ఎఫ్), బయో రీసోర్స్ కేంద్రాలు, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పిఎంఎఫ్ బివై) వంటి పలు కార్యక్రమాల అమలులో కృషి సఖిలు కీలక పాత్ర పోషిస్తారు. కట్టుబాటు, అభిరుచి, కఠోర శ్రమ, ఉత్సుకత వంటి లక్షణాలుండడం; స్థానికులు కావడంతో పాటు స్థానిక భాష, సంస్కృతి, ఆచరణలు వంటి అన్నింటి పైన అవగాహన గల వారు కావడం కూడా కృషి సఖిల ప్రత్యేకత. అలాగే గ్రామీణులు, రైతుల ఆనందం, విషాదం అన్నింటిలోనూ వారు భాగస్వాములు అవుతూ ఉంటారు. స్థానిక పర్యావరణ వ్యవస్థల పట్ల మెరుగైన అవగాహన కలిగి ఉంటారు. కృషి సఖిలు స్వయంగా రైతులే కావడంతో ప్రాంతీయ అంశాలపై వారికి చక్కని అవగాహన ఉంటుంది. స్నేహితులు, కుటుంబాలు, గ్రామీణులకు భిన్న అంశాలను సమగ్రంగా వివరించగల సామర్థ్యం వారికి ఉంటుంది.

కృషి సఖిలు కేవలం వ్యవసాయ మార్గదర్శకులు కాదు; వారు స్వయంగా రైతులు, రైతు మిత్రలు, సామాజిక వనరులు, చైతన్యం కల్పించే శక్తులు, టెక్నాలజీని అందరికీ అందుబాటులోకి తేవడంలో భాగంగా గ్రామీణ ప్రాంతాలను పరిశోధన సంస్థలతో కలిపే అనుసంధానకర్తలు. గ్రామీణ వ్యవస్థలో కీలక పాత్రధారులు కావడంతో పాటు వ్యవసాయం, గ్రామ వ్యవహారాల్లో లోతైన అవగాహన గల వారు కావడం వల్ల గ్రామీణ వ్యవసాయ సేవల్లో గల వ్యత్యాసాన్ని పూడ్చేందుకు ఎస్ఆర్ఎల్ఎంలు గ్రామాల్లో కృషి సఖిలకు శిక్షణ ఇస్తున్నాయి. వ్యవసాయ రంగం భవిష్యత్తును తీర్చి దిద్దగల సాధికారత, మార్పునకు సంబంధించిన కథనం ఇది.

సర్టిఫైడ్ కృషి సఖిలు రైతుల సామర్థ్యాలు నిర్మించి; రైతులు, కెవికెలు, వ్యవసాయ, అనుబంధ శాఖల మధ్య వారధిగా నిలిచే పారా ఎక్స్ టెన్షన్ కార్యకర్తలు, సామాజిక రీసోర్స్ పర్సన్ లుగా వ్యవహరిస్తారు. నవ్యపథంలో సమస్యల పరిష్కార కర్తలుగా వ్యవహరించే కృషి సఖిలు నైపుణ్యంతో సమాచారం వ్యాపింపచేయగల అసాధారణ వ్యక్తులు. వ్యవసాయ పర్యావరణం, ప్రకృతి వనరుల నిర్వహణ, పంటల వైవిధ్యం; ఆరోగ్య, పోషకాహార భద్రత వంటి అంశాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండే కృషి సఖిలు తమ గ్రామాల్లో సుస్థిర వ్యవసాయానికి వెన్నెమెకగా వ్యవహరిస్తారు.

వ్యవసాయ రంగానికి చెందిన వివిధ కార్యక్రమాల ప్రయోజనాలు రైతులు అందుకునేలా వారికి మార్గదర్శకం చేయగల కీలక వనరులు కృషి సఖిలు. జన్ భాగీదారిలో భాగంగా ప్రకృతి వ్యవసాయం, భూసార నిర్వహణ, భూసార పరీక్షలు వంటి అంశాలపై వారు చైతన్యం కల్పిస్తారు. కృషి సఖిల జీవనోపాధిపై ఈ కార్యక్రమాల ప్రత్యక్ష ప్రభావం ఉంటుంది. అలాగే వ్యవసాయానికి సంబంధించిన కార్యక్రమాలు, పథకాలు విస్తారంగం అందరికీ అందుబాటులోకి రావడానికి వీరు సహాయపడతారు. ఇప్పటివరకు సుమారుగా 3500 మంది కృషి సఖిలకు శిక్షణ ఇచ్చారు. 13 రాష్ట్రాల్లో సమాంతరంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

పరివర్తిత శక్తిగా కృషి సఖిలు : వ్యవసాయ రంగంలో పరివర్తన తీసుకురాగల శక్తి కృషి సఖిలు. వారు మార్పునకు విత్తనాలుగా వ్యవహరిస్తూ సుస్థిర వ్యవసాయం భవిష్యత్తును తీర్చి దిద్దగలుగుతారు. గ్రామీణ భారతంలో సమూలమైన మార్పు తీసుకురాగల అసాధారణ శక్తి కృషి సఖిలు.

సిఎఫ్ క్యుసిటిఐ పోర్టల్ : పోర్టుల వద్దనే శాంపిల్ సేకరణ, పరీక్షల కోసం ఎరువుల క్వాలిటీ కంట్రోల్ వ్యవస్థ (ఎఫ్ క్యుసిఎస్) పోర్టల్ వన్ టైమ్ పాస్ వర్డ్ (ఒటిపి)/ఎస్ఎంఎస్ అప్లికేషన్ ఫెసిలిటీని ప్రవేశపెట్టారు. ఈ కొత్త పోర్టల్ సిస్టమ్ ఒటిపిని జనరేట్ చేసి అధీకృత వ్యక్తి మొబైల్ నంబర్ కు పంపుతుంది. ఎఫ్ సిఓ, 1985గా నిర్దేశిత ఫారం-జెలో ఫెర్టిలైజర్ ఇన్ స్పెక్టర్ నింపిన వివరాలన్నింటినీ సంబంధిత వ్యక్తి పరీక్షించుకోవచ్చు. సమాచారంలో ఏవైనా తేడాలున్నట్టయితే ఒటిపిని ధ్రువీకరించేందుకు నిరాకరించవచ్చు. శాంపిల్ ను ఆటోమేటిక్ గానే సిస్టమ్ సంబంధిత లాబ్ కు కేటాయిస్తుంది. అధీకృత వ్యక్తికి లేదా దిగుమతిదారుకు సంబంధించిన ఇ మెయిల్ ఐడికి నేరుగా విశ్లేషణ నివేదిక పంపుతారు. రెండో దశలో దేశీయంగా తయారైన ఎరువుల శాంప్లింగ్ ను, పోర్టులు/డీలర్ సేల్ పాయింట్ల వద్ద ప్రత్యక్ష శాంపిల్ సేకరణ సదుపాయం కూడా పోర్టల్ లో పొందుపరుస్తారు.

ఈ సమావేశానికి వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ కార్యదర్శి; గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి; భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసిఏఆర్) డైరెక్టర్ జనరల్, కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు హాజరయ్యారు. అన్ని రాష్ట్రాల వ్యవసాయ శాఖల అధికారులు; నవోదయ విద్యా సమితులు (ఎన్ వివిఎస్), కేంద్రీయ విద్యాలయ సంఘటనలు (కెవిఎస్), ఏకలవ్య మోడల్ ఆశ్రమ పాఠశాలలు (ఇఎంఆర్ఎస్) ప్రతినిధులు; కృషి సఖిలు, వ్యవసాయ టెక్నాలజీ మేనేజ్ మెంట్ ఏజెన్సీ (ఆత్మ) కార్యకర్తలు, వివిధ కృషి విజ్ఞాన కేంద్రాల ప్రతినిధులు వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 2024-25 కాలానికి ముడి జనపనారకు కనీస మద్దతు ధరను ఆమోదించిన కేబినెట్

న్యూఢిల్లీ, మార్చి 8:ఆర్థిక సంవత్సరం 2024-25 కాలానికి ముడి జనపనారకు కనీస మద్దతు ధరలను ఇచ్చేందుకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోద ముద్ర వేసింది.

ముడి జనపనార (గతంలో టిడిఎన్ 5వ గ్రేడ్ తో సమానమైన టిడిఎన్-3)కి 2024-25 కాలంలో ఎంఎస్పీని క్వింటాలకు రూ. 5,335/- గా నిర్ణయించారు. ఇది మొత్తం భారతదేశ సగటు ఉత్పత్తి వ్యయం కంటే 64.8శాతం రాబడిని నిర్ధారిస్తుంది. 2024-25 సీజన్‌లో ముడి జనపనారకు ప్రకటించిన ఎంఎస్పి 2018-19 బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించిన విధంగా, మొత్తం దేశం మొత్తం సగటు ఉత్పత్తి విలువకన్నా కనీసం 1.5 రెట్లు ఎక్కువ స్థాయిలో ఎంఎస్పీని నిర్ణయించాలన్న సూత్రానికి అనుగుణంగా ఉంది.

వ్యవసాయ ఖర్చులు ధరలలు కమిషన్ (సిఏసిపి) చేసిన సిఫార్సుల ఆధారంగా ఈ నిర్ణయం ఉంది.

గత సీజన్ కన్నా క్వింటాలు ముడిజనపనార ఎంఎస్పీ 2024-25లో రూ. 285/- పెరిగింది. గత పది సంవత్సరాలలో ప్రభుత్వం 2014-15లో గల క్వింటాలు ముడి జనపనార ఎంఎస్పీని రూ. 2,400 నుంచి 2024-25లో క్వింటాలు రూ. 5,335/-కు పెంచి, దాదాపు 122 శాతం వృద్ధిని నమోదు చేసింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023-24లో, రూ. 524.32 కోట్ల విలువైన 6.24 లక్షల బేళ్ళ ముడి జనపనారను ప్రభుత్వం రికార్డు మొత్తంలో సేకరించి దాదాపు 1.65 లక్షల రైతులకు లబ్ధి చేకూర్చింది.

మద్దతు ధరల కార్యకలాపాలను చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీగా జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (జెసిఐ) వ్యవహరిస్తుంది. అటువంటి కార్యకలాపాలలో ఏమైనా నష్టాలు వాటిల్లితే కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారాన్ని పూర్తిగా చెల్లిస్తుంది.

# '21వ పశుగణనలో పశుపోషకులు మరియు వారి పశువుల సంఖ్య' అనే అంశంపై మధ్యప్రదేశ్‌లో వర్క్‌షాప్

న్యూఢిల్లీ, మార్చి 8:పశు సంవర్ధక మరియు పాడిపరిశ్రమ శాఖ, మత్స్య, పశుసంవర్ధక మరియు పాడిపరిశ్రమ మంత్రిత్వ శాఖ ఈరోజు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో '21వ పశుగణన లో పశుపోషకులు మరియు వారి పశువుల సంఖ్య' అనే అంశంపై వర్క్‌షాప్‌ను నిర్వహించింది. పశుపోషకులు జీవనం, వారి నివాసాలు, వివిధ ప్రాంతాలలో మార్గాలు మొదలైన వాటిపై మెరుగైన ఆలోచనలు మరియు పశుపోషణ యొక్క సమగ్ర నిర్వచనం, సేకరించాల్సిన సమాచారం మరియు సమాచారంను సేకరించే పద్ధతి వంటి విభిన్న అంశాలపై ఉమ్మడి ఏకాభిప్రాయానికి రావడానికి ఈ వర్క్‌షాప్ నిర్వహించబడింది.

గుజరాత్, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ ఉ కాశ్మీర్ మొదలైన పశుపోషకులు ఉన్న రాష్ట్రాలు, సహజీవన్ వంటి పశుపోషకులతో వ్యవహరించే ఎన్ జీ ఓ లు: సెంటర్ ఆఫ్ పాస్టోరలిజం, ఎడారి వనరుల కేంద్రం, సంచార మరియు అభివృద్ధి మరియు సంక్షేమ బోర్డు వంటి పశుపోషణతో వ్యవహరించే వివిధ ప్రభుత్వ సంస్థ సెమి సంచార జాతులు, నేషనల్ రెయిన్‌ఫెడ్ ఏరియా అథారిటీ (ఎన్ఆర్ఎఎ), మధ్యప్రదేశ్‌లోని గిరిజన పరిశోధన సంస్థ తదితర సంస్థలు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నాయి.పశుసంవర్ధక మరియు పాడిపరిశ్రమ శాఖ 1919 నుండి ప్రతి 5 సంవత్సరాలకు దేశవ్యాప్తంగా పశువుల గణనను నిర్వహిస్తోంది. చివరి పశుగణన అంటే 20వ ఎల్ సీ 2019లో నిర్వహించబడింది. 21వ పశుగణన 2024లో జరగనుంది. 21వ పశుగణనలోపశుపోషకులు వారి పశువుల సమాచారాన్ని సేకరించాలని డిమాండ్ ఉంది.

పశువుల గణన సరైన ప్రణాళిక మరియు పశుసంక్షేమ కార్యక్రమాన్ని రూపొందించడానికి ఈ రంగంలో మరింత అభివృద్ధిని తీసుకురావడానికి ఈ ప్రధాన సమాచారం మూలం. పశువుల గణన సాధారణంగా అన్ని పెంపుడు జంతువులు మరియు ఈ జంతువులలో వివిధ జాతుల జంతువులు (పశువులు, గేదె, మిథున్, యాక్, గొర్రెలు, మేక, పంది, గుర్రం, పోనీ, మ్యూల్, గాడిద, ఒంటె, కుక్క, కుందేలు మరియు ఏనుగులు ఉంటాయి. )/పౌల్ట్రీ పక్షులు (కోడి, బాతు మరియు ఇతర పౌల్ట్రీ పక్షులు) ఆ సైట్‌లోని గృహాలు, గృహ సంస్థలు/ గృహేతర సంస్థలు వాటి వయస్సు,

# మహిళల విజయాలు భావితరాలకు మార్గదర్శకంగా నిలవాలి: సీపీ శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 8:మహిళలు సాధిస్తున్న విజయాలు భావితరాలకు మార్గదర్శకంగా నిలవాలని హైదంాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం బంజారా హిల్స్‌లోని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఉమెన్స్ డే వేడుకలను ప్రారంభించి.. ఉత్తమ సేవలందించిన మహిళా ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఎల్ అండ్ ఓ విక్రమ్ మాన్ సింగ్, జాయింట్ సీపీ (అడ్మిన్) జె.పరిమళ హనా నూతన్, ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ డి.కవిత, సీఎస్‌డబ్ల్యూ డీసీపీ రష్మీ పెరుమాల్, సీఏడీవో సుధారాణి, జేఏవో ఉర్మిళ, సూపరింటెండెంట్ జ్యోతి, మినిస్టీరియల్ సిబ్బంది, మహిళా పోలీసులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# శాన్ ఫ్రాన్సిస్కో విమానాశ్రయంలో షాకింగ్ ఘటన

## -విమానం టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లో ఊడిపోయిన టైర్

## -పార్కింగ్ ప్రదేశంలో ఉన్న కార్లపై టైర్ పడి పలు కార్లు ధ్వంస

శాన్ ఫ్రాన్సిస్కో మార్చ్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కో విమానాశ్రయంలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. యునైటెడ్ ఎయిర్ లైన్స్‌కు చెందిన విమానం టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లో దాని టైర్ ఊడిపోయింది అయితే అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. 235 మంది ప్రయాణికులు 14 మంది సిబ్బందితో గురువారం శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి జపాన్‌కు బయల్దేరింది. ఈ క్రమంలో విమానం టేకాఫ్ అయిన కొన్ని సెకన్లలోనే ల్యాండింగ్ గేర్‌లో ఎడమవైపు ఉన్న ఆరు చక్రాల్లో ఒకటి ఊడి కిందపడిపోయింది. దీంతో అప్రమత్తమైన పైలట్ విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సి వచ్చింది. విమానం లాస్ ఏంజెల్స్ లో సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. అదృష్టవశాత్తు విమానంలో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. ఘటనపై ఎయిర్‌లైన్స్ సంస్థ కూడా స్పందించింది. ఇలాంటి సందర్భాల్లో సురక్షితంగా లాండయ్యేలా విమానాన్ని డిజైన్ చేసినట్లు వెల్లడించింది. అయితే, ఊడిన విమానం టైర్ శాన్ ఫ్రాన్సిస్కో విమానాశ్రయంలోని పార్కింగ్ ప్రదేశంలో ఉన్న కార్లపై పడింది. దీంతో పలు కార్లు ధ్వంసమయ్యాయి.

# కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక ఆహ్వానం..

హైదరాబాద్, మార్చి 8: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక ఆహ్వానం అందింది. దేశంలోనే అత్యుత్తమ ఇంజనీరింగ్ విద్యాసంస్థల్లో మొదటి వరుసలో నిలిచే ఐఐటీ మద్రాస్ తమ విద్య సంస్థలో జరిగే అంట్రపెన్యూరల్ సమ్మిట్ అనే కార్యక్రమంలో ప్రసంగించాల్సిందిగా కేటీఆర్‌ను ఆహ్వానించింది. ప్రతి ఏటా ఐఐటీ మద్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించే అంట్రపెన్యూరల్ ఫెస్టివల్ ఈ-సమ్మిట్ లో కీలకోపన్యాసం చేయాలని కోరింది.

ఐఐటీ మద్రాస్‌లో ప్రతి ఏటా నిర్వహించే ఈ- సమ్మిట్‌కు దేశ విదేశాల నుంచి అంట్రపెన్యూరల్ రంగంలో కీలకమైన వ్యక్తులను, సంస్థల అధిపతులను, పాలసీ మేకర్లను, ప్రముఖ వ్యక్తులను ఆహ్వానిస్తుంది. కేటీఆర్‌కున్న అపారమైన అనుభవాన్ని పురస్కరించుకొని, భవిష్యత్తు అంట్రపెన్యూరల్ ఔత్సాహికులకు దిశా నిర్దేశం చేయాల్సిందిగా కేటీఆర్‌కు పంపిన ఆహ్వానంలో ఐఐటీ మద్రాస్ పేర్కొంది.

ఐఐటీ మద్రాస్ విద్యార్థులు ప్రతిఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. దేశంలోనే అంతర్జాతీయ గుర్తింపు ఐఎస్ఓ సర్టిఫికేషన్ కలిగిన ఏకైక కార్యక్రమంలో నిలిచింది. రేపు, ఎల్లుండి జరగనున్న ఈ కార్యక్రమానికి హాజరై ప్రసంగించాల్సిందిగా కేటీఆర్‌కు పంపిన ఆహ్వానంలో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి పీయూష్ గోయల్, ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు ఒకరైన క్రిస్ గోపాలకృష్ణన్, హెచ్‌సీఎల్ సహ వ్యవస్థాపకులు అజయ్ చౌదరి వంటి ప్రముఖులు ఈ కార్యక్రమంలో ప్రసంగించనున్నట్లు ఐఐటి మద్రాస్ తెలిపింది.

# భక్తులతో శివాలయాలు కిటకిట





సంగారెడ్డి, మార్చి 8: (నేటినిజం ప్రతినిధి):మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో అతి పురాతనమైన శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో ఇవాళ తెల్లవారిజం నుండి శ్రీ మల్లికార్జున స్వామి వారికి అభిషేకాలు కొనసాగుతున్నాయి. పట్టణంతో పాటు పరిసర గ్రామాలనుండి వేలాది మంది భక్తులు తరలివచ్చి శ్రీ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. పెద్ద ఎత్తున అభిషేకాలు చేయిస్తున్నారు. భక్తుల పెద్ద ఎత్తున తరలిరావడంతో దర్శనం కోసం గంట నుండి రెండు గంటల సమయం పడుతుంది .

శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం తో పాటు మక్తల్ పట్టణంలోని శ్రీ అతి పురాతనమైన ఉమామహేశ్వరాలయం , శ్రీ కుంభేశ్వరాలయం, శ్రీ నగరేశ్వరాలయం ,శ్రీ ఆత్మలింగేశ్వరాలయం అదే విధంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం లోని శివాలయంలోనూ అభిషేకాలు విశేష పూజలు కొనసాగాయి. భక్తులు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టారు. స్వామివారికి అభిషేకాలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు.

ఆలయాల వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు .ఎండల నుండి తట్టుకోవడానికి టెంట్లు , కూర్చునేందుకు కుర్చీలు వంటివి తో పాటు మంచినీటి వసతిని కల్పించారు. భక్తులు ఆ పరమశివుడిని ప్రశాంతంగా దర్శించుకున్నారు. అర్చకులు తిప్పయ్య స్వామి ,సిద్ధ రామయ్య స్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు కొనసాగాయి.

# 800 మంది మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ చేసిన హరీష్ రావు



సిద్దిపేట మార్చి 8: సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు 800 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో సిద్దిపేటలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో శుక్రవారం జరిగింది.

సిద్దిపేట అర్బన్, నంగునూర్ మండలాలకు చెందిన 800 మంది మహిళలు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ పొందారు.

శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం వారందరికి ఉచితంగా కుట్టు మిషన్లు అందజేశారు హరీశ్‌రావు. ఈ సందర్భంగా హరీశ్‌రావుకు లబ్దిదారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. హరీశ్‌రావుకు ఎంతో రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

# చింతకాని మాజీ ఎంపీపీని పరామర్శించిన వైరా ఆత్మ కమిటీ చైర్మన్



ఖమ్మం, మార్చి 8:(నేటినిజం ప్రతినిధి): చింతకాని మండల మాజీ ఎంపీపీ వందనం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు నారపోగు వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో శస్త్ర చికిత్స చేయించుకున్న విషయం తెలుసుకొని వారి ఇంటి వద్ద పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితి గురించి వారిని అడిగి తెలుసుకున్న వైరా నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు పాషా, నాయకులు పరిక రామారావు, సాయి వంశీ, తదితరులున్నారు.

# బుగ్గ రామలింగేశ్వర ఆలయంలో ఎస్పీ కోటిరెడ్డి పూజలు



హైదరాబాద్, మార్చి 8: వికారాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీ బుగ్గ రామలింగేశ్వర ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా వికారాబాద్ జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి శుక్రవారం కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎస్పి కోటిరెడ్డి దంపతులచే శ్రీ రామలింగేశ్వరునికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎస్పీ కోటిరెడ్డి మాటాడుతూ మహాశివరాత్రి అందరికీ పర్వదినమని జిల్లాలోని ప్రజలు అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుని కోరుకున్నట్టు తెలిపా రు.

## ఏపీలో పొత్తులపై కొలిక్కిరాని చర్చలు.. సీట్ల సంఖ్యపై మల్లగుల్లాలు

అమరావతి, మార్చి 8:ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మూడుపార్టీల మధ్య సీట్ల సంఖ్యపై చర్చలు కొనసాగుతున్నాయి. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నిన్న రాత్రి ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, కేంద్ర మంత్రి అమిత్ షా తో జరిపిన చర్చలు కొలిక్కి రాలేదు. దీంతో శుక్రవారం మరోసారి కలవాలని నిర్ణయించుకున్నారు.

ఏపీలో మొత్తం 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. ఇప్పటికే టీడీపీ, జనసేనల మధ్య సీట్ల 118 చోట్ల సీట్ల పంపకం పూర్తయింది. వీటిలో టీడీపీ 94 స్థానాలు దక్కించుకోగా జనసేన 24 స్థానాల్లో పోటికి అంగీకారం కుదిరింది. టీడీపీ 12 ఎంపీ స్థానాలు, జనసేన మూడు స్థానాల్లో పోటికి ఒప్పందం జరిగింది. మిగిలిన 10 స్థానాలను రిజర్వ్ చేసుకున్నారు.

# ప్రత్యేక ఆరోగ్య పరీక్ష శిబిరం - ఫినోమ్ ఇండియాను నిర్వహించిన సిఎస్ ఐఆర్ - ఎన్ఐఎస్‌సిపిఆర్

న్యూఢిల్లీ, మార్చి 8:సిఎస్ఐఆర్ కుటుంబం కోసం ఫినోమ్ ఇండియా (ఖఎ-అఉఒఅఐ -పిఐ-చెక్) పేరుతో ప్రత్యేక ఆరోగ్య పరీక్షా శిబిరాన్ని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సిఎస్ఐఆర్) ప్రారంభించింది. ఆరోగ్య, సంక్షేమ పరీక్షల ద్వారా స్వాస్థ్య భారత్ వికసిత్ భారత్‌ను ఖరారు చేయడం సిఎస్ఐఆర్ చొరవకు సంబంధించిన కీలక లక్ష్యాలు. భారతదేశంలోని అతపెద్ద పరిశోధన, అభివృద్ధి సంస్థలలో సిఎస్ఐఆర్ ఒకటి. దేశవ్యాప్తంగా వ్యాపించిన 137 ప్రయోగశాలల నెట్‌వర్క్ ఇది.

కాగా, న్యూఢిల్లీలోని తన పూసా ఆవరణలో 3-5 మార్చి 2024వరకు పిఐ-చెక్ ఆరోగ్య పరీక్షా శిబిరాన్ని సిఎస్ఐఆర్‌కు చెందిన ప్రయోగశాలల్లో ఒకటి అయిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ కమ్యూనికేషన్ అండ్ పాలసీ రీసెర్చ్ (ఎన్ఐఎస్‌సిపిఆర్) నిర్వహించింది.

సిఎస్ఐఆర్- ఎన్ఐఎస్‌సిపిఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ రంజనా అగర్వాల్, సిఎస్ఐఆర్-ఐజిఐబి ప్రధాన శాస్త్రవేత్త డా. శంతను సేన్‌గుప్తా ఆరోగ్య పరీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. సిఎస్ఐఆర్ కుటుంబంలో సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు ఈ మార్గదర్శక చొరవ కట్టుబడి ఉంటుంది.

ఈ కార్యక్రమాన్ని డా. కనికా మాలిక్, డా. నరేంద్ర కుమార్ సాహూ, డా. అర్విండ్ మీనా, శ్రీ నరేంద్ర పాల్, శ్రీ కైలాస్ చందర్ పరేవాలు సమర్థవంతంగా సమన్వయం చేశారు. ముఖ్యంగా, పిఐ- చెక్ ఆరోగ్య పరీక్షా శిబిరాలకు మంచి ఉత్సాహవంతమైన స్పందన వచ్చింది. సంస్థలోని దాదాపు 98మంది సభ్యులు ఇందులో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఫినోమ్ ఇండియా అనేది కేవలం ఆరోగ్య పరీక్షా శిబిరమే కాదు, మన జాతి ప్రత్యేక ఆరోగ్య పరిదృశ్యాన్ని అర్థం చేసుకునే దిశగా ఒక మార్గదర్శక అడుగు. పిఐ-చెక్ ద్వారా వైవిధ్యమైన డేటాను సేకరించడం ద్వారా ప్రతి వ్యక్తికీ వారి శరీరానికి తగ్గట్టుగా తగిన ఆరోగ్య సంరక్షణ పరిష్కారాలకు మార్గాన్ని సుగమం చేయడం ద్వారా అత్యాధునిక వైద్య పరిజ్ఞాన్ని పెంపొందించడానికి గణనీయంగా దోహదపడాలని సిఎస్ఐఆర్ కోరుకుంటోంది.

ఫినోమ్ ఇండియా- సిఎస్ఐఆర్ హెల్త్ కోహోర్ట్ నాలెడ్జ్ బేస్ (పిఐ-సిహెచ్ఇసికె ) అన్నది నిర్దిష్టంగా భారత్‌కు సంబంధించి కార్డియో మెటాబాలిక్ (హృదయ జీవకోశ సంబంధ) వ్యాధుల, ప్రమాదకారకాలను గుర్తించడానికి సిఎస్ఐఆర్ రూపొందించిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు.

దేశంలోని వివిధ సిఎస్ఐఆర్ ప్రయోగశాలల నుంచి నిపుణులు, భాగస్వాముల సహకారంతో నిర్వహించిన ఈ సంచలనాత్మక అధ్యయనం, వ్యక్తిగతీకరించిన, ఖచ్చితమైన వైద్యం దిశగా గణనీయమైన పురోగతిని సూచిస్తూ విలువైన శాస్త్రీయ అంతర్దృష్టులను అందించేందుకు ప్రయత్నిస్తుంది.

విభిన్నమైన, వైవిధ్య భారత జనాభాను ఆవరించే లక్ష్యంతో సిఎస్ఐఆర్ ప్రారంభించిన దీర్ఘకాలిక సమన్వయ అధ్యయనమే పిఐ-చెక్. దేశవ్యాప్తంగా ఉన్న ప్రయోగశాలల నుంచి ప్రాతినిధ్యం కలిగిన ఈ ఆరోగ్య సమన్వయ అధ్యయనం చికిత్సా సంబంధ ప్రశ్నాపత్రాలు, జీవనశైలిక, ఋూమార అలవాట్లు, శరీర కూర్పు, కొలతలు, స్కానింగ్ ఆధారిత అంచనాలు, రక్త జీవరసాయన శాస్త్రం, మాలిక్యులార్ ఆస్సే ఆధారిత డేటాతో సహా సమగ్ర డేటాను సేకరిస్తుంది.

శాస్త్రీయ సమాచారాన్ని, రుజువుల ఆధారిత శాస్త్రీయ సాంకేతికతను, ఆవిష్కరణ విధాన పరిశోధనను, ప్రజలలో శాస్త్రీయ అవగాహనను ప్రోత్సహించేందుకు కట్టుబడిన సంస్థ సిఎస్ఐఆర్- నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ కమ్యూనికేషన్ అండ్ పాలసీ రీసెర్చ్ (సిఎస్ ఐఆర్ - ఎన్ఐఎస్‌సిపిఆర్). నవీన చొరవలు, సమన్వయ కృషితో శాస్త్రీయ సమాజానికి, సాధారణ ప్రజలకు మధ్య అంతరాన్ని పూడ్చేందుకు సిఎస్ ఐఆర్ - ఎన్ఐఎస్‌సిపిఆర్ ప్రయత్నిస్తుంది.

# వేయిస్తంభాల ఆలయంలో తిరిగి పూజలు ప్రారంభం..



వరంగల్, మార్చి 8:అలనాడు వేయిస్తంభాల గుడిని కట్టేందుకు 72సంవత్సరాలు పట్టిందని కేంద్ర మంత్రి, భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆలయంలో పునర్నిర్మించిన కల్యాణ మండపాన్ని ఆయన నేడు ప్రారంభించారు. కుటుంబ సమేతంగా వేయి స్తంభాల గుడి యాగశాలలో శాంతి హోమం చేశారు.

ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏఎస్ఐ అధికారులకు చాలా పరిమితులున్నాయని, ఆ పరిమితుల్లోనే వాళ్లు పనిచేస్తారని, వీటి కారణంగా నిర్మాణం కాస్త ఆలస్యమైన మాట వాస్తవమేనన్నారు. దేశ చరిత్రలో కాకతీయుల పాలన కాలం స్వర్ణయుగం లాంటిదన్నారు. వ్యవసాయం మొదలుకుని.. కళలు, సంస్కృతి, సంప్రదాయాలు, చేతివృత్తులకు వారు ఇచ్చిన ప్రాధాన్యత ఇవాళ్టికి కూడా రీసెర్చ్ టాపిక్ అని పేర్కొన్నారు. అలాంటి కాకతీయుల కళావైభవానికి ఇవాళ భక్తులకు అంకితమైనటువంటి ఈ వేయి స్తంభాల మండపం ఓ మచ్చుతునక అని అన్నారు.

మధ్యయుగంలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేవాలయాలను ధ్వంసం చేశారన్నారు. తుగ్లక్ సైన్యం రామప్ప గుడి నుంచి వరంగల్ కోట వరకు అన్నింటినీ దెబ్బతీసిందని చెప్పారు. తాజాగా పునర్నిర్మాణం చేసిన వేయి స్తంభాల గుడి కల్యాణ మండపంలో 132 స్తంభాలు ఏర్పాటు చేసినట్లు కిషన్‌రెడ్డి వివరించారు. కాకతీయుల శిల్ప కళా వైభవం అద్భుతమని కొనియాడారు. ప్రాచీన కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిదన్నారు.

### వేయిస్తంభాల ఆలయ చరిత్ర..

1163లో కాకతీయ పాలకుడైన రుద్రదేవుడు ఈ ఆర్కిటెక్చురల్ మార్వెల్ (ఇంజనీరింగ్ అద్భుతం)ను నిర్మించారు. అప్పట్లోనే దీన్ని నిర్మించేందుకు 72ఏళ్లు పట్టిందని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి.1324-25లో తుగ్లక్ సైన్యం చేసిన దాడిలో ఈ మందిరం కొంత మేర ధ్వంసమైంది. దీంతోపాటుగా ఈ మందిరంలో ఉన్నటువంటి.. సూర్య, వాసుదేవ విగ్రహాలను తుగ్లక్ సైన్యం తీసుకెళ్లింది. మధ్యయుగ కాలంనాటి ఈ గుడి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక కేంద్రంగా ప్రత్యేకతను చాటుకుంది. ఇక్కడున్న మండపంలో గ్రామసభలు, నాట్య కార్యక్రమాలు నిర్వహించుకునేవారు.

### 2006లో వచ్చిన వరదలకు కుంగిన పిల్లర్లు ..

2006లోవచ్చిన వరదలు ఈ ఆలయంలోని పిల్లర్లలో భారీగా నీరు చేరడంతో కొన్ని కుంగిపోయాయి.. దీంతో ముందు జాగ్రత్తగా 132 స్తంభాలున్న కల్యాణ మండపాన్ని అప్పుడే కూల్చేశారు. ఆ తర్వాత అప్పుడే పునర్నిర్మాణ ప్రక్రియను ప్రారంభించారు.. అయితే వివిధ కారణాలతో ఈ నిర్మాణ క్రతువు ఆలస్యమైంది. 18 సంవత్సరాలకు నిర్మాణం పూర్తి కాగా, నేడు తిరిగి ఈ ఆలయంలో పూజలకు శ్రీకారం చుట్టారు..

# పైన్ సూది ఆకుల ఆధారిత ఇంధన తయారీ సాంకేతికతను అమలు చేయడానికి సీ ఎస్ ఐ ఆర్ -ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం యూ కాస్ట్ తో చంపావత్‌లో అవగాహన

న్యూఢిల్లీ, మార్చి 8:గౌరవ ముఖ్యమంత్రి శ్రీ పుష్కర్ సింగ్ ధామి ఆదేశాలు మరియు మార్గదర్శకత్వంలో, ''ఆదర్శ్ చంపావత్'' మిషన్ ఆధ్వర్యంలో డెహ్రాడూన్‌లోని సీ ఎస్ ఐ ఆర్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం మరియు యూ కాస్ట్ మధ్య మంగళవారం, మార్చి 5వ తేదీన ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం డైరెక్టర్ డాక్టర్ హరేంద్ర సింగ్ బిష్త్, యూకోస్ట్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ దుర్గేష్ పంత్ ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేసి చంపావత్‌లో పైన్ సూది ఆకుల నుంచి ఇంధనాన్ని తయారు చేసే సాంకేతికతను వినియోగించే చారిత్రాత్మక ప్రాజెక్టును ప్రారంభించారు.

ఈ ఒప్పందం ప్రకారం, సీ ఎస్ ఐ ఆర్ - ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం చంపావత్‌లో క్షేత్ర స్థాయిలో రెండు ప్రధాన సాంకేతికతలను అమలు చేస్తుంది. పైన్ సూది ఆకుల ఆధారంగా గంటకు 50 కిలోల సామర్థ్యం కలిగిన బ్రికెట్ యూనిట్ మరియు గ్రామీణ గృహాల కోసం 500 యూనిట్ల మెరుగైన వంట స్టవ్ సాంకేతికతలు ఉన్నాయి. వీటి లో భాగంగా శక్తి పొదుపు మరియు దాని పర్యావరణ ప్రభావానికి సంబంధించి విస్తరించిన క్షేత్ర ప్రయత్నాల అధ్యయనం నిర్వహించబడుతుంది. మహిళా సాధికారత కార్యక్రమంలో భాగంగా చంపావత్‌లోని ఇంధన పార్క్‌లో ఈ బ్రికెట్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఉత్పత్తి చేయబడిన బ్రికెట్లను గృహాలు మరియు స్థానిక పరిశ్రమలలో ఇంధనంగా ఉపయోగిస్తారు.

సీ ఎస్ ఐ ఆర్ - ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం డైరెక్టర్ డాక్టర్ హరేంద్ర సింగ్ బిష్త్ మాట్లాడుతూ, అడవి మంటలను తగ్గించడానికి పైన్ సూది ఆకుల వాడకం మరియు నిర్వహణ అవసరమని అన్నారు. పైన్ సూది ఆకుల బ్రికెట్లు మరియు గుళికలు బొగ్గుఇంధనంను భర్తీ చేయగలవు మరియు పర్యావరణాన్ని రక్షించగలవు. బ్రికెట్లను దేశీయ వంటలకు మరియు ఇటుక బట్టీలు మరియు బొగ్గు విద్యుత్ ప్లాంట్లలో ప్రత్యక్ష లేదా సహ-అగ్ని ఇంధనంగా ఉపయోగించవచ్చు.

ఇండియన్ పెట్రోలియం ఇన్స్టిట్యూట్ పైన్ సూది ఆకుల యొక్క వినియోగం మరియు విలువ జోడింపుపై తీవ్రంగా పనిచేస్తోందని మరియు పైన్ సూది ఆకులను బ్రికెట్ చేయడానికి మెరుగైన సాంకేతికతను మరియు శక్తి-సమర్థవంతమైన, తక్కువ-ధర, సహజ డ్రాఫ్ట్ జీవ పదార్థ వంట స్టవ్ ను అభివృద్ధి చేసిందని కూడా ఆయన తెలియజేశారు. జీవ పదార్థ వంటస్టవ్ 35% శక్తి సామర్థ్యంతో పైన్ సూది ఆకుల బ్రికెట్‌లతో పని చేస్తుంది మరియు గృహ కాలుష్యాన్ని 70% తగ్గిస్తుంది. అదనంగా, సీ ఎస్ ఐ ఆర్ - ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం బొగ్గు విద్యుత్ ప్లాంట్‌లలో ఉపయోగం కోసం జీవ పదార్థ గుళికలను ధృవీకరించడానికి నియమించబడిన ప్రయోగశాల. ప్రయోగశాలలో జీవ పదార్థ క్యారెక్టరైజేషన్ మరియు జీవ పదార్థ దహన పరికరాల మూల్యాంకనం కోసం అధునాతన సౌకర్యాలు ఉన్నాయి.

ప్రొఫెసర్ దుర్గేష్ పంత్ మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి గారి దిశానిర్దేశం మరియు మార్గదర్శకత్వంలో, యూ కాస్ట్ నోడల్ ఏజెన్సీగా, చంపావత్‌ను ఆదర్శ జిల్లాగా మార్చడానికి సంవత్సరాలుగా కృషిచేశామని అన్నారు. పైన్ సూది ఆకుల సేకరణ, దాని విలువ జోడింపు మరియు పరిశ్రమకు సరఫరా చంపావత్ గ్రామీణ ప్రజలకు మంచి వ్యాపార అవకాశాలను అందిస్తుందని ఆయన మాకు తెలియజేశారు. అంతేకాకుండా, బ్రికెట్ మరియు నాణ్యత నియంత్రణ పారామితులపై చిన్న సాంకేతిక శిక్షణతో, చంపావత్ గ్రామీణ ప్రజలు దానిని పరిశ్రమలకు సరఫరా చేయవచ్చు అలాగే దానిని రోజువారీ ఆదాయ వనరుగా మార్చవచ్చు. భవిష్యత్తులో ఈ బ్రికెట్లకు అధిక డిమాండ్ ఉంటుంది కాబట్టి, పైన్ సూది ఆకుల బ్రికెట్‌లను పూర్తి-సమయ రంగంగా మార్చవచ్చు, రోజువారీ ఉపాధి అవకాశాలను అందిస్తుంది. అంతేకాకుండా, నైపుణ్యం మరియు పాక్షిక-నైపుణ్యం కలిగిన గ్రామీణ ప్రజలకు మెరుగైన వంట పొయ్యిల తయారీ మరియు మార్కెటింగ్ ఆకర్షణీయమైన ఎంపికగా మారుతుంది. మరో సీ ఎస్ ఐ ఆర్ ప్రయోగశాల, సీ ఎస్ ఐ ఆర్-సీ ఐ ఎం ఎ పి, లక్నో, ''అరోమా మిషన్'' కింద చంపావత్‌లో అద్భుతమైన పని చేస్తోందని ఆయన తెలిపారు.

మిస్టర్ పంకజ్ ఆర్య, లీడ్ ప్రాజెక్ట్ సైంటిస్ట్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం చంపావత్ జిల్లా యొక్క సుస్థిరమైన అభివృద్ధి కోసం శాస్త్ర మరియు సాంకేతిక ఆధారిత నమూనాపై ప్రదర్శన, అమలు మరియు నైపుణ్యం అభివృద్ధి విభాగాలతో పని చేస్తోందని చెప్పారు. శిక్షణ, నైపుణ్య అభివృద్ధి, మార్కెట్ అనుసంధానాల ద్వారా గ్రామీణ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఈ ప్రాజెక్టు ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని చెప్పారు. 100 కంటే ఎక్కువ మంది గుర్తించబడిన లబ్ధిదారులకు చంపావత్‌లో కొత్త ఉపాధి అవకాశాలను అదనంగా సృష్టించడం ద్వారా బయోమాస్ బ్రికెట్ మరియు అధునాతన దహన పరికరాల తయారీ, నిర్వహణ మరియు నిర్వహణలో శిక్షణ పొందుతారు. అలాగే స్థానిక మహిళలు మరియు యువత శాస్త్రీయ చైతన్యాన్ని మరియు నైపుణ్యాభివృద్ధిని పునరుద్ధరించడానికి దూరవిద్య పద్ధతులు, వర్క్‌షాప్‌లు మరియు ప్రదర్శనలు నిర్వహించబడతాయి. అంతిమంగా ఈ ప్రాజెక్ట్ చంపావత్‌లో ఇంధన పొదుపు, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి మరియు మహిళా సాధికారతకు సహాయపడుతుంది. డాక్టర్ సనత్ కుమార్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం నుండి డాక్టర్ జి.డి. ఠాక్రే మరియు యుకోస్ట్ నుండి డాక్టర్ డి.పి. ఉనియాల్, శ్రీమతి పూనమ్ గుప్తా కూడా పాల్గొని ప్రాజెక్ట్ రూపకల్పనలో ముఖ్యమైన సహకారాన్ని అందించారు మరియు విజయవంతంగా అమలు చేయడానికి సూచనలను అందించారు.

# ఆరేళ్ల తర్వాత కూటమిలోకి తెలుగుదేశం

### -వచ్చే లోక్ సభ, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ- జనసేనతో బీజేపీ కలిసి పోటీ

అమరావతి మార్చ్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఆరేళ్ల తర్వాత నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్ (ఎన్డిఏ) కూటమిలో తెలుగుదేశం పార్టీ చేరబోతుంది. వచ్చే లోక్ సభ, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ- జనసేనతో బీజేపీ కలిసి పోటీ చేయనుంది. ఢిల్లీలో టీడీపీ అధినేత చంద్రబాబు , జనసేన అధినేత పవన్ కల్యాణ్ మకాం వేశారు. పోటీ చేసే స్థానాల గురించి సుధీర్ఘంగా చర్చిస్తున్నారు. ఇప్పటికే టీడీపీ-జనసేన మధ్య సీట్ల షేరింగ్ జరిగింది. ఆయా చోట్ల బీజేపీ కోరడంతో చర్చలు సుధీర్ఘంగా జరుగుతున్నాయి.తెలుగుదేశం పార్టీ-భారతీయ జనతా పార్టీ మధ్య తొలి నుంచి స్నేహబంధం ఉంది. రాష్ట్ర విభజన తర్వాత కూడా బీజేపీతో టీడీపీ కలిసి ఉంది. 2018లో రాష్ట్రానికి నిధుల విషయంలో విభేదాలు వచ్చాయి. ఆ సమయంలో కూటమి నుంచి టీడీపీ బయటకు వచ్చింది. 2019లో కేంద్రంలో ఎన్డీఏ విజయం సాధించింది. ఏపీలో వైసీపీ గెలుపొందింది. చాలా టీడీపీ- బీజేపీ మధ్య గ్యాప్ వచ్చింది. ఇన్నాళ్లకు రెండు పార్టీలు కలిసి ప్రజల్లోకి వెళ్లబోతున్నాయి.9 అసెంబ్లీ 5 లోక్ సభ సీట్లను బీజేపీ అడిగినట్టు తెలుస్తోంది. శ్రీకాళహస్తి, జమ్మలమడుగు, కైకలూరు, ధర్మవరం, విశాఖ (నార్త్), ఏలూరు, రాజమండ్రి, అరకు, విజయవాడ సెంట్రల్ అసెంబ్లీ స్థానాలను బీజేపీ కోరుతుంది. వీటితోపాటు తిరుపతి, రాజంపేట, రాజమండ్రి, అరకు, నరసాపురం లోక్ సభ సీట్ల కోసం పట్టుబడుతోంది. సీట్ల కేటాయింపుపై స్తబ్దత నెలకొంది. ఈ నెల 10వ తేదీన బీజేపీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశమై అభ్యర్థులను ప్రకటించనుంది. ఆ లోపు టీడీపీ జనసేనతో బీజేపీ పొత్తు ఖరారయ్యే అవకాశం ఉంది. లోక్ సభ, ఏపీ అసెంబ్లీ ఎన్నికలను టీడీపీ జనసేన, బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. కలిసి బరిలోకి దిగి వైసీపీని గట్టి దెబ్బ కొట్టాలని భావిస్తున్నాయి. ఏపీలో ఉన్న సమస్యలే ఏజెండాగా ముందుకెళ్లనున్నాయి. జగన్ హయాంలో జరిగిన తప్పులను ఎత్తి చూపే అవకాశం ఉంది. కరెంట్ సమస్య, ఇసుక కొరత, కొందరు వాలంటీర్ల అనుచిత ప్రవర్తనను ప్రధాన అస్త్రాలుగా తీసుకునే అవకాశం ఉంది.

# బీఆర్ఎస్ తప్పులను వెలికితీస్తాం- కఠినంగా శిక్షిస్తాం : కొండా సురేఖ

వరంగల్, మార్చి 8: పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఉద్యోగులను పట్టించుకోలేదని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిని సందర్శించిన ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా.. ముందుగా ఎంజీఎం మహిళా సిబ్బంది అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మీరు అందరూ ప్రభుత్వం గెలుపుకు కారణం అయినందుకు మీ అందరికి చెప్పినట్లుగానే ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు.

అదేవిధంగా మీరు నర్సింగ్ ఉద్యోగాన్ని సద్వినియోగం చేసుకుని పేషంట్లకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. ఎంజీఎంకి వచ్చిన ప్రతి పేషెంట్ కి మీ వంతు సేవ తప్పనిసరి అవసరం ఉంటుందని మంత్రి కొండా సురేఖ చెప్పారు. అదేవిధంగా కొంతమందికి నెలల జీతం ఆగిపోవడంతో అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. 10 సంవత్సరాల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఉద్యోగులను కూడా పట్టించుకోలేదని దుయ్యబట్టారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రణాళిక లేకుండా వరంగల్ జైలును కూలగొట్టి మల్టీ స్పెషాలిటీ కడతామని చాలా డబ్బు వృథా చేశారని మండిపడ్డారు. తద్వారా ప్రజలకు ఉద్యోగులకు ఎలాంటి మేలు జరగలేదని.. ఎవరైనా సరే ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తే ఊరుకునే పరిస్థితి లేదని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులు ఎన్నో ఉన్నాయి అవి కూడా త్వరలోనే బయటకు తీస్తామన్నారు. ఎంజీఎం ఆసుపత్రిని అన్ని రకాలుగా తీర్చిదిద్దుతామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

# త్వరలోనే మహిళందరికీ వడ్డీ లేని రుణాలు : మంత్రి కోమటిరెడ్డి



నల్లగొండ , మార్చి 8: మహిళల ఆర్థిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా నల్గొండ పట్టణంలోని పానగల్‌లోని చారిత్రాత్మక పచ్చల ఛాయా సోమేశ్వరాలయంలో పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇక్కడ ఉన్న ఆలయాలకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఆలయాల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని చెప్పారు. మహిళా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తామన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. త్వరలోనే వారికి వడ్డీలేని రుణాలు ఇస్తామని స్పష్టం చేశారు.


ఆహ్వానం

తెలంగాణ రాష్ట్ర భాషా సంస్కృతిక శాఖ
సౌజన్యంతో
శ్రీమతి గడ్డం సులోచన
రచించిన
నానీ లోచనాలు
కవితా సంపుటి ఆవిష్కరణ సభ
తేది శనివారం 9 మార్చి 2024 ఉదయం గం॥10-00 లకు
రవీంద్రభారతి సమావేశ మందిరం
(మొదటి అంతస్తు), హైదరాబాద్
ముఖ్య అతిథి / ఆవిష్కర్త
ఆచార్య డా॥ ఎన్. గోపి
కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, పూర్వ వైస్-ఛాన్సలర్, తెలుగు యూనివర్సిటీ
సభాధ్యక్షులు
ప్రొఫెసర్ సూర్యాధనుంజయ్
పూర్వ అధ్యక్షులు, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం
కృతి స్వీకర్త
డా॥ ఉదారి నారాయణ
ప్రముఖ కవి
ఆత్మీయ అతిథులు
శ్రీ కుడికాల వంశీధర్
ప్రముఖ కవి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్
డా॥ బి. ఆదినారాయణ
నానీల కవి, అసిస్టెంట్ ప్రొఫెసర్, సికింద్రాబాద్ కాలేజీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం
ఆహ్వానించువారు
కొమ్మిడి లక్ష్మీనారాయణ రెడ్డి


# మహాసమాధిని దర్శించుకున్న నారా లోకేష్

అనంతపురం మార్చి 8: శంఖారావం సభలో పాల్గొనేందుకు పుట్టపర్తికి విచ్చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శుక్రవారం ఉదయం శ్రీ సాయిబాబా మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రశాంతి నిలయంలో నారా లోకేష్ కు సత్య సాయి ట్రస్టీ ఆర్జే రత్నాకర్ ఇతర ప్రతినిధులు సాదర స్వాగతం పలికారు. నారా లోకేష్ వెంట మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, టిడిపి నాయకులు, ప్రముఖులు ఉన్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతి నిధులు మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా 130 దేశాల్లో 1200కు పైగా కేంద్రాల ద్వారా ఆధ్యాత్మి, సేవా కార్యక్రమాలు నిరంతరం కొన సాగుతున్నట్టు లోకేశ్‌కు వివరించారు. ఆయా దేశాల నుంచి ఏటా లక్షలాదివ ంది భక్తులు ప్రశాంతి నిలయాన్ని సందర్శిస్తూ బాబా అనుగ్రహం పొందుతున్నట్టు చెప్పారు. సత్యసాయి తాగునీటి ప్రాజెక్టు ద్వారా అనంతపు రం జిల్లాతోపాటు ఉభయ గోదావరి జిల్లాల్లోని 1500కు పైగా మారుమూ ల గ్రామాలకు తాగునీరు అందిస్తున్నట్టు తెలిపారు.

# డ్యామ్ సేఫ్టీ నిపుణుల సూచన మేరకే కాళేశ్వరంపై నిర్ణయం : మంత్రి శ్రీధర్ బాబు




హైదరాబాద్, మార్చి 8: డ్యామ్ సేఫ్టీ అధికారులు, నిపుణుల సూచన మేరకే కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజ్‌ల విషయంలో నిర్ణయం తీసుకుంటామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుఅన్నారు.

శుక్రవారం పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని బిక్షేశ్వర స్వామి దేవాలయంలో ఆయన మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడ సాగునీటికి ఇబ్బందులు లేకుండా.. తాగునీటికి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అంతకు ముందు అర్చకులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న హీరో గోపీచంద్




తిరుపతి, మార్చి 8: కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని టాలీవుడ్ నటుడు గోపీచంద్ దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం తిరుమల చేరుకున్న గోపీచంద్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గోపీచంద్‌కి అర్చకులు ఆశీర్వాదం అందించారు. అంతకుముందు ఆలయ అర్చకులు ఆలయ సాంప్రదాయం ప్రకారం హీరో గోపీచంద్‌కు స్వాగతం పలికారు.

గోపీచంద్ ప్రధాన పాత్రలో వచ్చిన తాజా చిత్రం 'భీమా'. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన ఈ సినిమాకు కన్నడ దర్శకుడు ఏ హర్ష దర్శకత్వం వహించగా.. ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ హీరోయిన్లుగా నటించారు. ఈ సినిమా మహాశివరాత్రి కానుకగా నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇక ఈ సినిమా విజయం సాధించాలని శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు గోపీచంద్.

